నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 11-8-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 8 పేజీలు:6 వెల: రూ.1/-

నమ్మలేని నిజాలు

సారాలో సారం
జీవితం పెను భారం
యమదర్శనం

స్వరాలవీణ
సుధా రసాలసోన
కనుమరుగు.

అప్పుల ఊబి
ఉచితాల జిలేబి
పాకంలో ఈగ

గురుపౌర్ణమి
వెల్గు మసిబారింది
భక్తితగ్గింది.

మేఘస్ఫోటనం
వికృతి జయోత్సవం
మానవలీల.

– రేడియమ్
సెల్: 9291527757

శ్రీనిజాయి

మన దేశం జరుపుతున్న
స్వాతంత్ర్యపు వజ్రోత్సవం !
ఎర్రకోటమీద ఎగురుతున్న
భరత జాతి జయోత్సవం !

భరతమాత చేతిలోంచి
ఎగిరిన పూల దండ !
తెల్లదొరల గుండెల్లో
నిదురోయిన జెండా !

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

ఐబీ హెచ్చరికలు.. రాష్ట్ర పోలీసులు అప్రమత్తం

హైదరాబాద్, ఆగష్టు 10: పంద్రాగస్టు నేపథ్యంలో ఇంటెలిజెన్స్ బ్యూరో హెచ్చరించింది. దీంతో తెలంగాణ పోలీసులు అప్రమత్తమయ్యారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో ఉగ్రవాదులు నగరంలో అల్లర్లు సృష్టించే అవకాశం ఉందని, దాడులకు పాల్పడే అవకాశం ఉందని ఐబీ హెచ్చరించింది. ఢిల్లీతో పాటు కీలక నగరాలను పాకిస్తాన్‌ప్రేరేపిత ఉగ్రవాద సంస్థలు లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందని కేంద్ర నిఘా వర్గాలు హెచ్చరించాయి. హైదరాబాద్‌లోని పర్యాటక ప్రాంతాలు, వీవీఐపీలు ఉండే ప్రదేశాల్లో హై అలర్ట్ ప్రకటించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు, రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లు, రద్దీ ప్రదేశాల్లో నిఘా పెంచనున్నారు.

ఇదిలా ఉండగా.. దేశ రాజధాని ఢిల్లీలో పోలీసులు ఇప్పటికే హైఅలర్ట్ ప్రకటించారు. ఇంటెలిజెన్స్ అధికారుల హెచ్చరికలతో 10వేలమందితో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగే ఎర్రకోట చుట్టూ ఉన్న ఎత్తయిన భవనాలపై షూటర్లను మోహరించడంతో పాటు నో ఫ్లయింగ్ జోన్లు అమలు చేస్తున్నారు. గాలి పటాలు, బెలూన్లు, డ్రోన్లు ఎగురవేయకుండా నిషేధం విధించగా.. నగరవ్యాప్తంగా వెయ్యికిపైగా అత్యాధునిక సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిభద్రతను పర్యవేక్షిస్తున్నారు.

స్కౌట్స్ & గైడ్స్ స్కూల్ దోమల్‌గూడలో వజ్రోత్సవం స్వతంత్ర దినోత్సవ సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎల్‌సి శ్రీమతి కల్వకుంట్ల కవిత గారు మరియు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ గారు, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత గారు, మాజీ కార్పొరేటర్ శ్రీమతి మూఠా పద్మ నరేష్ మరియు మూఠా జై సింహ గారు తదితరులు పాల్గొన్నారు.

రాజన్నను దర్శించుకున్న శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మన్ శ్రీధర్ రావు

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 10: (నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్లా జిల్లాలో ప్రసిద్ధ శైవ క్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో బుధవారం రాత్రి శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మెన్ మల్లంపాటి శ్రీధర్ రావు , డైరక్టర్ మల్లంపాటి శ్రీవిద్యస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కోడెలమొక్కు చెల్లించుకున్నారు దర్శనం అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకుల వేదోక్త ఆశీర్వదించారు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య విద్య సంస్థల చైర్మెన్ శ్రీధర్ మాట్లాడుతూ పవిత్రమైన శ్రావణ మాసంలో రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని, ప్రజలందరూ పాడిపంటలతో సుఖ సంతోషాలతో సంతోషంగా ఉండాలని స్వామివారిని కోరుకున్నట్లు ఆయన తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఆయన వెంట రీజనల్ ఇన్చార్జ్ ముద్రకోల రాజు ,ప్రిన్సిపాల్ స్కూల్ బృందం ఉన్నారు .

వంగర మండల కేంద్రంలో మొక్కలు నాటి ఫ్రీడమ్ పార్కు ఏర్పాటు

స్వతంత్ర భారత వజ్రోత్సవ వన మహోత్సవంలో భాగంగా పెద్ద వంగర మండల కేంద్రంలో మొక్కలు నాటి ఫ్రీడమ్ పార్కును ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాలకుర్తి దేవస్థానం కమిటీ చైర్మన్ వెనుకదాసుల రామచంద్రయ్య శర్మ, ఎమ్మార్వో రమేష్, ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి ,ఎస్సై రియాజ్ పాషా, ఎంపీటీసీ ఏదునూరి శ్రీనివాస్ , ఇన్చార్జి ఎంపీఓ జగదీష్ గౌడ్ ,కార్యదర్శి వెంకన్న ,అంగన్వాడి సూపర్వైజర్ కవిత, ఎపిఎం నరేందర్ కుమార్,ఇన్చార్జి ఐసి సురేష్, టెక్నికల్ అసిస్టెంట్లు యాకయ్య, సుమన్,గొదుగు సోమన్న, ఉప్పలయ్య, వెంకటరమణ,అంగన్వాడి ,అంగన్వాడి టీచర్లు మాధవి లత, మంజుల, కారోబార్ కుమార్, చిలుక మల్లేష్ , చిలుక సిద్దు, తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటా మువ్వన్నెల జెండా ఎగురాలి : మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్, ఆగష్టు 10: స్వాతంత్ర్య వజ్రోత్సవాలలో భాగంగా ప్రతి ఇంటిపైనా మువ్వన్నెల జెండా ఎగురవేయాలని న్యాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పిలుపునిచ్చారు. భారత స్వాతంత్ర్య స్ఫూర్తిని ప్రజల్లో నింపేందుకు, అమరవీరుల త్యాగాలను భవిష్యత్ తరాలకు తెలిజేసేందుకు వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించాలనని సీఎం కేసీఆర్ నిర్ణయించారు.

సీఎం కేసీఆర్ పిలుపు మేరకు దిసప్తాహ వేడుకలను అన్ని వర్గాల ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. స్వతంత్ర్య భారత వజ్రోత్సవాలను పురస్కరించుకుని వనమహోత్సవంలో భాగంగా గండిరామన్న హరితవనం ఫ్రీడం పార్క్ లో విద్యార్థులు, పట్టణవాసులతో కలిసి మంత్రి మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశ స్వతంత్రం కోసం పోరాడిన మహనీయుల చరిత్రను భవిష్యత్తు తరాలకు అందించాలన్నారు. ఎందరో మహనీయుల పోరాటాలు, ప్రాణత్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందన్నారు.

జిల్లా వ్యాప్తంగా ఇవాళ 75 వేల మొక్కలు నాటామన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ విజయలక్ష్మి రెడ్డి, కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ, అదనపు కలెక్టరు హేమంత్ బొర్కడే,జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షులు నల్ల వెంకట్రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ రథాన్ని ప్రారంభించిన మంత్రి మల్లారెడ్డి

హైదరాబాద్, ఆగష్టు 10: మాల్లారెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైకుంఠ రథాన్ని బుధవారం మంత్రి మల్లారెడ్డి మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మట్లాడుతూ.. ఘట్‌కేసర్ మండల ప్రజలకు సౌకర్యంగా ఉండేందుకు ఈ వాహనాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. మండలంలోని ప్రజల సమస్యల ను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు.ప్రజలకు సౌకర్యంగా ఉండేందుకు వీలుగా దాదాపు 15లక్షల రూపాయల విలువ చేసే అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఈ వైకుంఠ రథంమండల ప్రజా పరిషత్ కార్యాయంలో అందుబాటులో ఉంటుందని తెలిపారు.

కార్యక్రమంలో సర్పంచులు ఓరుగంటి వెంకటేశ్ గౌడ్, కాలేరు నరేష్, కొంతం వెంకట్‌రెడ్డి, యాదయ్య, మండల టీఆర్ఎస్ అధ్యక్షుడు రమేష్, ఘట్‌కేసర్ చైర్‌పర్సన్ ఎం.పావని, పోచారం మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి, ఘట్‌కేసర్ టీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బిహార్‌లో కొలువుదీరిన కొత్త ప్రభుత్వం.. సీఎంగా నితీశ్ ప్రమాణం

పాట్నా, ఆగష్టు 10: బిహార్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎనిమిదోసారి నితీశ్‌కుమార్ ప్రమాణస్వీకారం చేశారు. గవర్నర్ ఫగు చౌహాన్ నితీశ్‌కుమార్‌తో ప్రమాణస్వీకారం చేశారు.

ఆ తర్వాత ఉప ముఖ్యమంత్రి ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ప్రమాణం చేశారు. బీజేపీ, జనతాదళ్ యునైటెడ్ (జేడీయూ) సంకీర్ణ ప్రభుత్వాన్ని రద్దు చేసి, ఆయన ముఖ్యమంత్రిగా రాజీనామా చేశారు. ఆ తర్వాత ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్ష పార్టీలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు ఇవాళ ప్రమాణస్వీకారం చేశారు.

బిహార్‌లో బలాబలాలు..

2020లో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఎన్డీయే కూటమి గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. 245 సీట్లున్న బీహార్ అసెంబ్లీలో రెండు స్థానాలు నామినేటెడ్ కాగా, 243 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో మహా ఘట్‌బంధన్ కూటమిలోని ఆర్జేడీ 75 సీట్లు గెలిచి అతిపెద్ద పార్టీగా అవతరించింది. బీజేపీ 74, జేడీయూ 43, కాంగ్రెస్ 19 సీట్లు గెలిచాయి. ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడానికి 122 మంది సభ్యుల మద్దతు అవసరం కాగా, బీజేపీ, జేడీయూ, వీఐపీ, హెచ్ఏఎల్‌తో కలిసి నితీశ్ నాయకత్వంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడింది. ఈ కూటమిలో ఈ ఏడాది ప్రారంభంలో చీలికలు ప్రారంభమయ్యాయి. చివరకు బీజేపీతో నితీశ్‌కుమార్ తెగతెంపులు చేసుకున్నారు.

మళ్లీ విధుల్లోకి ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు

హైదరాబాద్, ఆగష్టు 10: రాష్ట్రంలోని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త వినిపించింది. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను మళ్లీ విధుల్లోకి తీసుకుంటున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇవాళ్టి నుంచే ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశించారు. ఈ మేరకు కలెక్టర్లు, జిల్లా అధికారులకు ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాలు జారీ చేశారు. గతంలో పని చేసిన చోటే 7,305 మంది ఫీల్డ్ అసిస్టెంట్ల విధులు నిర్వర్తించనున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకుంటామని ఇప్పటికే సీఎం కేసీఆర్ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం మళ్లీ విధుల్లోకి తీసుకోవడంతో ఫీల్డ్ అసిస్టెంట్లు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. అనేక చోట్ల ఫీల్డ్ అసిస్టెంట్లు సీఎం కేసీఆర్, మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చిత్ర పటాలకు పాలాభిషేకాలు చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా 2007 ఫిబ్రవరి లో 7,561 మంది ఫీల్డ్ అసిస్టెంట్లని ప్రభుత్వం విధుల్లోకి తీసుకుంది. అప్పట్లో రూ.1,200 జీతంతో విధుల్లోకి వచ్చిన వారికి కొద్ది నెలల్లోనే రూ. 10వేల జీతాలు ఇచ్చింది. ఉపాధి హామీ కూలీల మస్టర్ రోల్స్ రాయడం, వారి పనులను పర్యవేక్షించడం వంటి పనులు చేశారు.

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను భావితరాలకు తెలియజేయాలి : మంత్రి గంగుల

కరీంనగర్ , ఆగష్టు 10: : (నేటినిజం ప్రతినిధి): భారత స్వతంత్ర్యం కోసం అహర్నిశలు పోరాడిన వారి గురించి స్మరించకుంటు వారి పోరాట త్యాగాలను భావితరాలకు చాట్టిచెప్పేలా స్వాతంత్ర్య వజ్రోత్సవాలను నిర్వహించుకోవాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు.

వజ్రోత్సవాల్లో భాగంగా మంత్రి బుధవారం హౌసింగ్ బోర్డు కాలనీలో ఫ్రీడం పార్క్ ను ప్రారంభించారు. కొత్తపల్లి గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఫ్రీడం పార్క్ లో మొక్కలు నాటారు. అనంతరం వజ్రోత్సవాలలో భాగంగా జిల్లా కేంద్రంలోని ప్రతిమ మల్టిప్లెక్స్ లో విద్యార్థుల కోసం ప్రదర్శిస్తున్న గాంధీ చిత్రాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి తిలకించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజలలో దేశభక్తిని పెంపొందించాలనే ఉద్దేశంతో స్వతంత్ర భారత వజ్రోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. భావితరాలకు సంపదను సృష్టించాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ఆలోచన మేరకు మొక్కలను నాటడం, ఆపదలో ఉన్న వారిని ఆదుకునేలా రక్తదాన శిభిరాలను ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలను అగస్టు 8 నుంచి 22 వరకు రోజుకు ఒకటి చొప్పున నిర్వహిస్తామన్నారు.

కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్,నగర మేయర్ వై. సునీల్ రావు పోలీస్ కమిషనర్ వి.సత్యనారాయణ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి , మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్ పాల్గొన్నారు.

ఫ్రీడం రన్ విజయవంతం చేయాలి : పోలీస్ కమిషనర్

ఖమ్మం, ఆగష్టు 10: (నేటినిజం ప్రతినిధి): స్వాతంత్ర్య భారత వజ్రోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 11న జిల్లా వ్యాప్తంగా నిర్వహించే ఫ్రీడం రన్‌లో పౌరులు అధిక సంఖ్యలో పాల్గొని జాతీయ భావాన్ని చాటి చెప్పాలని పోలీస్ కమిషనర్ విష్ణు యస్.వారియర్ పిలుపునిచ్చారు. 2 కె. ఫ్రీడం రన్‌లో సందర్భంగా జిల్లా అధికార యంత్రాంగం ప్రతి మండలానికి 100 ఫ్రీడం రన్ టీ షర్ట్స్ ను పంపిణీ చేసేందుకు సర్దార్ పటేల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ పాల్గొన్నారు. పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా టీ షర్ట్స్ పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ..దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న వజ్రోత్సవాలను పురస్కరించుకుని ప్రభుత్వం ప్రతి రోజూ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందేనని. ఇందులో భాగంగా జిల్లాలో వేల మందితో 2 కె ఫ్రీడం రన్ నిర్వహించాలని ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. ఇందులో పాఠశాల, కళాశాలల విద్యార్థులు, క్రీడాకారులు, కళాకారులు, విద్యార్థులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు.

ఈ సందర్భంగా టీ షర్ట్స్ స్పాన్సర్ చేసిన జీఆర్ రియల్ ఎస్టేట్, జీవీ మాల్, బీలీఫ్ హాస్పిటల్, బాలాజీ రియల్ ఎస్టేట్, వేంకటేశ్వర గార్మెన్స్ వారిని మెమోంటో తో సత్కరించారు. కార్యక్రమంలో టౌన్ ఏసీపీ అంజనేయులు, ప్రసన్న కుమార్, జిల్లా స్పోర్ట్స్ అధికారి పరందమయ్య రెడ్డి, పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం గౌరవ ముఖ్యమంత్రి గ నిర్దేశించిన వజ్రోత్సవాల కార్యక్రమంలో భాగంగా జడ్చి కో–ఆప్షన్ వలియబీ సలీమ్ గారు ఏటూరునాగారంలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్పోర్ట్స్ స్కూల్ లో విద్యార్థులు మరియు ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటడం జరిగింది మరియు శంకరాజ్ పల్లి నర్సరీ ఏటూరునాగారం లోని బృహత్ పల్లె ప్రకృతి వనం లో మొక్కలు నాటడం జరిగింది అలాగే మండల కేంద్రంలోని సినిమా టాకీస్ లో స్కూల్ మరియు కళాశాల విద్యార్థుల కోసం ఉచితంగా వేసిన గాంధీ సినిమా ప్రదర్శనను చూసిన తరువాత విద్యార్థులతో మాట్లాడుతూ మహనీయుల వీరోచిత పోరాటం వారి త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్రం వచ్చిందని వారి త్యాగాలను స్మరించుకుంటూ ముఖ్యమంత్రి కెసిఆర్ గారు రాష్ట్ర వ్యాప్తంగా వజ్రోత్సవాల కు శ్రీకారం చుట్టారని మహనీయుల జీవిత చరిత్ర నేటి విద్యార్థులు తెలుసుకొని వారి స్ఫూర్తితో విద్యార్థులు బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించడం జరిగింది

బోనాల పండుగ సంధర్భంగా ముత్యాలమ్మకు మొక్కులు చెల్లించిన ఎంపిపి ఈదురు రాజేశ్వరి

మహబూబాబాద్, ఆగష్టు 10: (నేటినిజం ప్రతినిధి): _ పెద్దవంగర మండలం చిట్యాల గ్రామంలో బోనాల పండుగ సందర్భంగా ఎంపిపి ఈదురు రాజేశ్వరి ముత్యాల తల్లికి బోనం మరియు సారె చీర చెల్లించి మొక్కులు చెల్లించుకున్నారు. తరువాత గ్రామ ప్రజలు మరియు మండల ప్రజలు అందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ తల్లికి ప్రత్యేకంగా పూజలు చేసి సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు...ఈ కార్యక్రమంలో తెరాస మండల పార్టీ అధ్యక్షులు ఈదురు ఐలయ్య, ఉపసర్పంచ్ ఈదురు లచ్చమ్మ, తెరాస గ్రామ పార్టీ యూత్ ప్రధాన కార్యదర్శి ఎల్తూరి మహేష్, యూత్ నాయకులు ఈదురు ప్రవీణ్, ఈదురు నవీన్,మాజీ వార్డు సభ్యులు ఈదురు వెంకన్న, ఈదురు సోమల్లు,ఈదురు ఎల్లమ్మ, ఈదురు ముత్తయ్య,పూజారులు తిమ్మడి వెంకటద్రీ, తిమ్మడి సోమయ్య తదితరులు పాల్గొన్నారు....

చరిత్రలో నేటినిజం



నేటినిజం
సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 11-8-2022



సుంకోరవం

మట్టిమనిషిని ముట్టుకోవటం
ఇష్టముండదంటావా?
పట్టెడన్నం పట్టేదీ
మట్టేనని మరిచావా

ఒత్తిడిని జయిస్తే
విజేతలు
ఒత్తిడి జయిస్తే
పరాజితులు.

ముడివేసేది
మానవత్వం
విడదీసేది
మృగతత్వం

-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

ఘనంగా జరిగిన 'అమృతలత -అపురూప పురస్కారాలు-2022' ప్రదానోత్సవం

అభినందన పుస్తకాన్ని ఆవిష్కరించిన జూలూరు గౌరీశంకర్, వరప్రసాద్‌రెడ్డి, రోజారమణి, డా॥ అమృతలత తదితరులు.

కులమతాలకు అతీతంగా విలువల తో కూడిన సమాజ నిర్మాణానికి రచయిత్రు లు, కవయిత్రులు కృషి చేయాలని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ పిలుపునిచ్చారు. సోమవారం పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం లోని ఎన్టీఆర్ కళామందిరంలో 'అమృత లత-అపురూప పురస్కారాలు-2022' ప్రదానోత్సవం నిర్వహించారు. 'అభినందన' పుస్తకాన్ని ఆవిష్కరించిన జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ సాహిత్య, సాంస్కృతిక రంగం సక్రమంగా ఉన్నప్పుడే సమాజం ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు. శాంతా బయోటెక్ అధినేత డాక్టర్ కే.ఐ.వరప్రసాద్‌రెడ్డి, నటి రోజారమణి, రచయిత్రి విద్యావేత్త డా॥ అమృతలత, వేదుకల కన్వీనర్ నెల్లుట్ల రమాదేవి తదితరులు పాల్గొన్నారు.


'మేథోపథం' పుస్తకం ఆవిష్కరిస్తున్న పైడిపాల, ఆచార్య యన్.గోపి, పుస్తక రచయిత ఎన్వీఎస్ రెడ్డి, ప్రతిమా, వరప్రసాదరెడ్డి, సుద్దాల అశోక్‌తేజ, జూలూరీ గౌరీశంకర్.

సామాజిక దృక్కోణంతో రచనలు చేయాలి

-భావదర్పణం ఆవిష్కరణ సభలో అధికార భాషాసంఘం అధ్యక్షురాలు మంత్రి శ్రీదేవి

సామాజిక దృక్కోణంతో రచనలు చేయాలని తెలంగాణ రాష్ట్ర భాష అధికార సంఘం అధ్యక్షురాలు మంత్రి శ్రీదేవి అన్నారు. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా వేదిక అధ్యక్షుడు డా. రాయారావు సూర్యప్రకాశ్ రావు అధ్యక్షతన నిర్వహించిన సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆగస్టు ఏడో తేదీన హైదరాబాదులోని రవీంద్రభారతిలో జరిగిన ఈ సభలో డా. చీదెళ్ళ సీతాలక్ష్మి రచించిన 'సీతమాట' ద్విశతిని మంత్రి శ్రీదేవి ఆవిష్కరించారు. డా. రాయారావు సూర్యప్రకాశ్ రావు సంపాదకత్వంలో వెలువడ్డ 'భావదర్పణం' కవితాసంకలనాన్ని 'నేటినిజం' పత్రిక సంపాదకులు బైసా దేవదాసు ఆవిష్కరించారు. సమాజంలో సానుకూల మార్పు ఆశిస్తూ రచనలు చేయాలని ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి శ్రీదేవి సూచించారు. మన భాషను మనం ప్రేమించడంతో పాటు ఇతరభాషలను కూడా ఆదరించాలని ఆమె పేర్కొన్నారు. తెలుగు భాష భిన్న సంస్కృతులతో అలరారుతుందని ఆమె అన్నారు. మాతృభూమిని, మాతృమూర్తిని, మాతృభాషను మర్చిపోగూడదని మంత్రి శ్రీదేవి అన్నారు.

'భావదర్పణం' 'సీతమాట' పుస్తకాల ఆవిష్కరణలో సంతోష్, రాధశ్రీ, రామకృష్ణ చంద్రమౌళి, డా॥ చీదెళ్ళ సీతాలక్ష్మి, డా॥ రాయారావు సూర్యప్రకాశ్, బైస దేవదాసు, మంత్రి శ్రీదేవి, డా॥ నాళేశ్వరం శంకరం, డా॥ అమ్మంగి వేణుగోపాల్, వర్ఘుల శివకుమార్, సత్యనారాయణ.

కవులు నిరంతరం సాధన చేస్తూ ఉండాలని 'భావదర్పణం' సంకలన ఆవిష్కర్త, 'నేటినిజం' దినపత్రిక సంపాదకులు బైసా దేవదాసు అన్నారు. నిత్యవిద్యార్థిగా కవి ఉన్నప్పుడే ఉత్తమ ఫలితాలు పొందగలరని ఆయన అభిప్రాయపడ్డారు. లోపాలను సరిదిద్దుకుంటూ కవిత్వానికి సాన పెట్టుకోవాలని ఆయన సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు కవిత్వం వైద్యం లాంటిదని ఆయన అన్నారు. కవిత్వం ఉత్తమ ప్రజలను తయారు చేస్తుందని, తద్వారా సమాజ నిర్మాణానికి చేయూత ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదికల ఆధ్వర్యంలో రూపొందిస్తోన్న ఏకాంశ కవిత్వాన్ని గత 93 వారాలుగా నేటినిజం'లో క్రమం తప్పకుండా ప్రచురిస్తున్నట్టు ఆయన చెప్పారు. గత 93 వారాలుగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంస్థల కవులు రచించిన వేలాది కవితలు నేటినిజం'లో ప్రచురితమయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఏకాంశ కవిత్వం మొదలైన కృత్యాల ద్వారా కవుల రచనలను ప్రోత్సహిస్తున్న వేదికల అధ్యక్షుడు డా. రాయారావు సూర్యప్రకాశ్ రావును ఆయన అభినందించారు.

మల్కాజిగిరి-మేడ్చల్ జిల్లా సాహిత్య వేదిక, దర్పణం కవులు గూగుల్ షీట్ గొలుసుకట్టు కవితను తెలుగు సాహిత్యంలో నూతన ప్రయోగంగా ప్రవేశపెట్టిన డా. రాయారావు సూర్యప్రకాశ్ రావును ఆయన అభినందించారు. డా. చీదెళ్ళ సీతాలక్ష్మి రాసిన 'సీతమాట' ద్విశతిలో ప్రశంసనీయమైన పద్యాలున్నాయని ఆయన అన్నారు. కవిత్వ మెలకువలను అభ్యాసం ద్వారా నేర్చుకోవాలని ఆయన సూచించారు.

మంత్రి శ్రీదేవి గారిని సత్కరిస్తున్న రాయారావు సూర్యప్రకాశ్, బైస దేవదాసు, చీదెల్ల సీతాలక్ష్మి, సత్యనారాయణ, వర్ఘుల శివకుమార్

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదికల ద్వారా ఆధునిక కవులను, రచయితలను తీర్చిదిద్దుతున్నట్టు ఆ రెండు సంస్థల అధ్యక్షుడు డా. రాయారావు సూర్యప్రకాశ్ రావు చెప్పారు. ప్రతి రోజూ ఏకాంశ కవిత్వం అనే పేరుతో అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నట్టు ఆయన వివరించారు. ఇప్పటివరకు 610 అంశాలు ఇచ్చినట్టు ఆయన వెల్లడించారు. వీటిలో నగం అంశాలకు కవితలు రాసినా కనీసం ఐదారు కవితా సంపుటాలకు సరిపోయే సృజనను వేదికలోని ప్రతి కవీ చేసినట్టు ఆయన చెప్పారు. వేదికలో వచ్చిన కవితల్లో కొన్ని 'నేటినిజం' పత్రికలో గత 93 వారాలుగా ప్రచురితం అవుతున్నట్టు ఆయన చెప్పారు. కవిత్వ ప్రచురణం ద్వారా కవులను ప్రోత్సహిస్తున్న సంపాదకులు బైసా దేవదాసుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

డా. చీదెళ్ళ సీతాలక్ష్మి రాసిన సీత మాట' ద్విశతిపై ప్రముఖ కవి డా. రాధాశ్రీ ప్రసంగించారు. 'సీతమాట'లో పద్య రచనను ప్రశంసనీయంగా చేశారని ఆయన డా. చీదెళ్ళ సీతాలక్ష్మి అభినందించారు. శతక రచనలో డా. సీతాలక్ష్మి చక్కటి నైపుణ్యాన్ని కనబరిచారని సభలో ప్రసంగించిన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక ఉపాధ్యక్షుడు ముదిగొండ సంతోష్ అన్నారు. వేదిక చేస్తున్న కృషిని ఈ సందర్భంగా వేదికల ప్రధాన కార్యదర్శి డా. చీదెళ్ళ సీతాలక్ష్మి వివరించారు.

రోజంతా వైభవంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఉదయం కవి సమ్మేళనాలు జరిగాయి. మధ్యాహ్నం గ్రంథాల ఆవిష్కరణను నిర్వహించారు. ఉదయం జరిగిన మొదటి సమావేశానికి వేదిక ప్రధాన కార్యదర్శి డా. చీదెళ్ళ సీతాలక్ష్మి అధ్యక్షత వహించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక కార్యదర్శి నక్క హరికృష్ణ స్వాగతం పలికారు. నేటి కవితా రీతులపై మొదటి సమావేశ ముఖ్య అతిథి, తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జె. చెన్నయ్య ప్రసంగించారు. ఆధునిక కవుల రచనా పద్ధతులను ఆయన విశ్లేషించారు. గతంలో ఎన్నడూ లేనంతగా ప్రస్తుతం సాహిత్య సృజన జరుగుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. కవులు నిరంతరం అధ్యయనం చేయాలని ఆయన సూచించారు. కవులు సాహిత్య అధ్యయనం ఒక అలవాటుగా చేసుకోవాలని సమావేశానికి అధ్యక్షత వహించిన వేదిక ప్రధాన కార్యదర్శి డా. చీదెళ్ళ సీతాలక్ష్మి సూచించారు. వేదిక కవులు ప్రొఫెసర్ సువర్ణ అలివేలు, డా. రమేశ్, జె. వి. కుమార్, జక్కని గంగాధర్, ముద్దు వెంకట లక్ష్మి మొదటి సెషన్ లో జరిగిన కవి సమ్మేళనంలో పాల్గొన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాల సహాయ ఆచార్యులు డా. రమేశ్ మొదటి సెషన్‌కు వందన సమర్పణ చేశారు.

'భావ దర్పణం' కృతిని అంకితం తీసుకుంటున్న డా॥ అమ్మంగి వేణుగోపాల్

అనంతరం జరిగిన రెండవ సమావేశానికి సాహిత్య వేదికల అధ్యక్షుడు డా. రాయారావు సూర్యప్రకాశ్ రావు అధ్యక్షత వహించారు. దర్పణం సాహిత్య వేదిక కార్యదర్శి నాగిరెడ్డి అరుణజ్యోతి సమావేశకర్తగా వ్యవహరించారు. ధనం ఇవ్వలేని సంతృప్తిని కవిత్వం ఇస్తుందని ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ పూర్వ అదనపు సంచాలకులు పసుల లక్ష్మారెడ్డి అన్నారు. కవిత్వం మనసుకు శాంతిని ఇస్తుందని ఆయన అన్నారు. వివిఎంఆర్ జి ఫౌండేషన్ ద్వారా యువతకు ఉపయుక్తమయ్యే గ్రంథాలను వెలువరిస్తున్నట్టు ఈ కార్యక్రయంలో పాల్గొన్న వివిఎంఆర్ జి ఫౌండేషన్ అధినేత వెలుగూరి సురేశ్ చెప్పారు. కవులు ఎప్పటికప్పుడూ తమ కవిత్వాన్ని తామే సవరించుకుంటూ సృజనకు పదును పెట్టుకోవాలని ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన సాహిత్య వేదికల అధ్యక్షుడు డా. రాయారావు సూర్యప్రకాశ్ రావు సూచించారు. వేదిక కవులు గుండం మోహన్ రెడ్డి, యాచం మంజులత, అరుణజ్యోతి, డా. కాసర్ల రంగారావు, జాలిగామ నరసింహారావు, డా. రాయారావు సూర్యప్రకాశ్ రావు, నన్నపురాజు విజయశ్రీ ఈ రెండవ సమావేశంలో కవిత్వాన్ని వినిపించారు. దర్పణం సాహిత్య వేదిక కార్యదర్శి గుండం మోహన్ రెడ్డి వందన సమర్పణతో రెండవ సమావేశం ముగిసింది.

మూడవ సమావేశానికి దర్పణం సాహిత్య వేదిక ఉపాధ్యక్షుడు రామకృష్ణ చంద్రమౌళి అధ్యక్షత వహించారు. ఇమ్మడి రాంబాబు సమావేశకర్తగా వ్యవహరించారు. యువతరం సాహిత్యం ద్వారా భాషను బతికిస్తోందని ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలుగు విశ్వవిద్యాలయ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీశంకర్ అభిప్రాయపడ్డారు. కోవిడ్ కాలంలో సాంకేతిక పరిజ్ఞానంతో సాహిత్యం మరింత విస్తరించిందని ఆయన పేర్కొన్నారు. కేవలం వాక్యాల కూర్పు మాత్రమే కవిత్వం కాదని ఆయన అన్నారు. సీనియర్ కవుల కవిత్వాన్ని అధ్యయనం చేయాలని ఆయన సూచించారు.

రచనల్లో పాటించవలసిన మెలకువలను ఈ సమావేశంలో గౌరవ అతిథిగా పాల్గొన్న ప్రముఖ రచయిత్రి పొత్తూరి విజయలక్ష్మి వివరించారు. జీవిత విధానాన్ని, సమాజాన్ని మార్చగల సాధనంగా సాహిత్యం కీలక భూమిక నిర్వహిస్తుందని మరో గౌరవ అతిథి, గాంధీ వైద్యకళాశాల పూర్వ ఆచార్యులు డా.కేశవరెడ్డి అభిప్రాయపడ్డారు. సాహిత్య అధ్యయనం విస్తృతంగా చేసినప్పుడే సృజన వికాసం సాధ్యమవుతుందని ఈ సమావేశంలో పాల్గొన్న మరో గౌరవ అతిథి, ఆకాశవాణి కార్యక్రమ నిర్వహణాధికారి గోపీచంద్ అన్నారు. ఈ సమావేశంలో ఇమ్మడి రాంబాబు, సత్యమూర్తి, విజయరాఖీ, గోపరాజు సూర్యనారాయణ, డా. కేశవరెడ్డి, డా. సీతాలక్ష్మి, రామకృష్ణ చంద్రమౌళి, గుర్రాల వెంకటేశ్వర్లు కవిత్వం వినిపించారు. ఈ సభలో అయోధ్యరెడ్డి, డా. సరోజ వింజామర, కందుకూరి మనోహర్, చెన్నాప్రగడ కృష్ణవేణి, సత్య మొండ్రేటి, ప్రవీణ్, సుమిత్ర, జక్కని గంగారాం గాదె శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

అతిథులు బైస దేవదాసు, మంత్రి శ్రీదేవి, డా॥అమ్మంగి వేణుగోపాల్, వర్ఘుల శివకుమార్‌లతో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా సాహిత్యవేదిక, దర్పణం సాహిత్య వేదిక కార్యవర్గ సభ్యులు.

తీరని ఋణం

నువ్వెవ్వరికీ
ఋణపడలేదనుకుంటే
అదే పెద్ద పొరపాటు
దేశ మట్టికణాలనిండా
అన్నీ నీ ఋణపత్రాలే.

దేశ చిత్రాలు

దేవుడి బొమ్మ గీయాలని
రంగుల ప్రయత్నం
చిత్రాలు పూర్తయ్యాయి
చూస్తే...ఒకటి జై జవాన్
రెండవది...జైకిసాన్

అల్లూరి ధైర్యం

నాదేశం నీడలో
నిలువెత్తున అల్లూరి చిత్రం
ధైర్యం పతాకమై ఎగురుతూ
అడవిలో ఆకులన్నీ
ఆయుధాలుగా మారుతూ

విలువైన మట్టి

తూకం వేశారు
టన్ను బంగారం
ఇట్టే తేలిపోయింది
నా జన్మభూమి
పిడికెడు మట్టిముందు

పవళింపు సేవ

లోపల నిద్రిస్తున్నది
వీర సైనికుడు
వింజామరలు విసురుతూ
సమాధి చుట్టూ
పూలమొక్కలు

-డా॥ కె.జి. వేణు
98480 70084

దొరికాడు సూర్యుడు

తూర్పున
సూర్యుడు మాయం
వెతికితే దొరికాడు
కవాతు చేస్తున్న
సరిహద్దుల తుపాకుల్లో

గర్వంగా నా జెండా

జెండా మోస్తున్నది
మూడు రంగుల్నేకాదు
వందేమాతర హృదయాన్ని
సారే జహాసే అచ్ఛా
నాదేశ జాతీయగీతాన్ని

దేశ భక్తి కి పుట్టిన రోజు

సొతంత్రం వొచ్చింది
దేశం లో అమాయకపు జనం అంటే
ఆ రోజుల్లో ని వాళ్ళే !!

సొంత ఇళ్ళని వదిలి పెట్టినోళ్లు
సొంత ఆస్తులన్నీ ఉద్యమాల కోసం
వెచ్చించి నోళ్లు-

తమ భార్యా బిడ్డల్ని వదలి
తమ కుటుంబాలని విడిచి
ఆకలి దప్పిక లకి వెరవక
తన దైన రీతిలో ఉద్యమాల్లో
పాల్గొన్నోళ్లు-

సొతంత్ర పోరులో
లాఠీల దెబ్బ లకి
కొరడా దెబ్బల వాతలకి
తమ తమ దేహాల నెత్తురు
కాలువలై అర్పించి నోళ్లు-

ఆనాటి జనులు
ఎంతటి అమాయకులో
అంత కి వందరెట్లు
పవిత్రత నిండిన దేశ భక్తులు
దేశ మే ప్రాణ మని
ప్రాణం తృణ ప్రాయంగా ఎంచి
తల వంచి నోళ్లు-

వాళ్లు అమాయకంగా
ఆవేశం గా అర్పించిన ప్రాణాలే
ఈ నాటి మన ఈ
స్వేచ్ఛా వాయువులు-

వాళ్ల. త్యాగాల తో
వాళ్ల నెత్తురు తో తడిసిన
ఈ నేల "ఒక అగ్ని పునీత "
వాళ్ల ధృఢ సంకల్పం లో
వాళ్ల చిత్తశుద్ధి తో పవిత్ర మైన
ఈ నేల త్రివేణీ సంగమం.

-వి.సూర్యారావు
92469 11234

దేశ భక్తి

దేశ భక్తి యున్న దేహము ధన్యము
నేల తల్లి మురియ నింట సిరులు
మమత సమత పంచు మర్యాద మించగా
మేలుగొలుప జాతి మేలిమగును

మతముఐకమత్య హిత సహవాసము
కులము మంచి తనముకు సహవాసి
బ్రతుకు సామరస్య భావ సంచారిణి
ప్రజలు శాంతి సుఖము బడయవలయు

భరత దేశ మొకటి బంగారు భూమియై
వెలిగె జిలుగు తోడ విభవమొప్ప
శక్తి యుక్తి కలిగి శత్రువులనణిచి
వీరజాతి యనుచువిశద పరచె

స్వచ్ఛమైన ధరణి స్వేచ్ఛను రక్షించి,
బడుగు జీవి వెతల బ్రతుకు చూసి,
కడుపు నింపు నిండు కరుణయు కలిగించు
జగము కీర్తి కలిగి జయము పొందు.

-డా॥సముద్రాల శ్రీదేవి
9949837743

జాతికీర్తి

బానిస సంకెళ్ల నుండి
విముక్తి పొంది స్వాతంత్రం
అనే స్వేచ్ఛ వాయువును అందించి
చరిత్ర పుటల్లో చిరస్థాయిగా
మిగిలారెందరో, శత్రువుల గుండెల్లో
భగభగ మండే
ఫిరంగులై పేలారేందరో,
కుల, మత, ప్రాంతీయ,
వర్గ భేదాలన్నీ తుడిచి స్వరాలన్నీ
సమైక్యపరచి హక్కుల పోరాటానికై
పిడికిలి బిగించి, ఐక్యతారూపమై
నిలిచారెందరో,
అన్యాయాన్ని న్యాయంగా
నిలదీసి హక్కుల పరిరక్షణకై
ప్రాణాలర్పించి, దౌర్జన్యానికి పాల్పడ్డ
దేశద్రోహులను తరిమి తరిమి కొట్టి
విప్లవ గీతం పాడారెందరో..

హింస అనే శస్త్రాన్ని వీడి ,
అహింస అనే అస్త్రాన్ని వాడి ,
విన్నోత రీతిలో
నిరసన తెలిపారెందరో,
ప్రపంచ దేశాలకే ఆదర్శంగా
నిలిచారందులో ...

అమ్మ గుండెలపై గుదిబండగా
మారి ఇనుప పాదాలతో రక్కుతున్న
అడుగులను విసిరిపారేసి,తాకట్టు
పెట్టిన ఆత్మాభిమానాన్ని విడిపించి,
నేల తల్లి రుణం తీర్చుకున్నారెందరో...
శాంతి, సహనం మా కులాలైనా,
ఆదరణ,ఆత్మీయత మా మతాలైనా,
నిలువెల్లా ముంచేసే నీ అభిమతాన్ని
తిప్పికొట్టే దమ్ము నాకుందని చాచికొట్టి,
త్రివర్ణపతాకం రెపరెపలాడేలా
జాతికీర్తిని పెంచారెందరో...!

-షేక్. నసీమాబేగం
9603567011

భారతావని మొగ్గలు

స్వతంత్ర భారతదేశంలో ప్రజలంతా ఏకమై
ఒకే తాటిపై నిలిచి గర్జించినపుడే స్వాతంత్ర్యఫలం
స్వాతంత్ర్య వజ్రోత్సవం ఘనమైన వైభవం !

ఉజ్వల భవిష్యత్తుకు సాక్ష్యంగా నిలుస్తూ
భారతావని శృంఖలాలు విదిలించుకున్న రోజు
అమరవీరుల త్యాగఫలమే జెండా వందనం !

లౌకికరాజ్యమై సర్వసుందరంగా నిలుస్తూ
ప్రపంచం చేత కొనియాడబడుతున్న కేతనం
మన భారతావని అన్ని దేశాలకు గురువు !

ప్రపంచ రాజకీయ నేపథ్యంలో
భారత స్వాతంత్ర పోరాటం అద్వితీయం
భారతీయులు స్వాతంత్ర్య పోరాటధీరులు !

స్వాతంత్ర్యస్ఫూర్తిని ప్రజలందరిలో మేల్కొలుపుతూ
దేశభక్తి భావనను అందరిలో నింపాలి
మన వజ్రోత్సవ వేడుక భారతీయ వైభవం !

-చంచల రవి కుమార్
8500330700

నా దేశం

అపార మేధా సంపన్నులున్న నా దేశం
నవ నాగరికతకు నిలువెత్తు రూపం..
నదీమ తల్లులు పరుగులు తీసే ఈ నేల
పాడి పంటలు పసిడి రాశులకు చిరునామా..
గుప్పున గుబాళించే సంగీత సాహిత్యాలు
ఔరా అనిపించే అద్భుత కళాఖండాలు..
ఎన్నో ఉద్యమాలకు ఇది పురిటి గడ్డ
ఎందరో స్వాతంత్ర్య యోధులకు అడ్డా..
మతాలెన్ని ఉన్నా భిన్నత్వంలో ఏకత్వం
ప్రపంచానికే ఆదర్శమనిపించే ప్రజాస్వామ్యం..
స్వాతంత్ర్య వజ్రోత్సవ వేళ ముప్పన్నెల కీర్తి
హర్ ఘర్ తిరంగా భారతీయులందరికీ స్ఫూర్తి..

-చెన్నాప్రగడ వీఎన్నెస్ శర్మ,
చరవాణి: 9440587567

కవిత్వపు కాంతులతో "ప్రాణదీపం"!

పుస్తక సమీక్ష



కన్నీటికి నిలువుటద్దం కవిత్వమని భావించే కవి, గాయకులు గాజోజు నాగభూషణంగారు జీవితాన్ని వస్త్రగాలం పడుతూ.. కాలానికి సజీవ సాక్ష్యంగా నిలిచేలా కష్టజీవుల చెమట నెత్తురుల సారంతో "ప్రాణదీపం" కవితా సంపుటికి జీవం పోశారు. 2007లో 'మట్టి సరిగమలు' పేరుతో నానీల పుస్తకాన్ని వెలువరించిన ఆయన.. చాన్నాళ్ల తర్వాత 'ప్రాణదీపం' పేరుతో తమ మొదటి కవితా సంపుటిని మనకు అందించారు. జీవితం.. కవిత్వం ఒక్కటేనని నిరూపిస్తూ.. కవిత్వాన్ని ప్రేమించడమంటే.. జీవితాన్ని ప్రేమించడ మేనని ఈ కవితా సంపుటి ద్వారా గాజోజుగారు తేల్చిచెప్పారు. కాలం కనిపించీ, కనిపించని గాయాలను పరిచ యం చేసినప్పుడల్లా, కవిత్వం మానవత్వపు మలామును అద్దుతూనే ఉండాలని ఆశించే ఆయన.. కవిత్వాన్ని ఒక తపస్సుగా, ఉ షస్సుగా భావిస్తూ కవిగా తమ యశస్సును పెంచుకునే విధంగా ఇందలి కవితల్ని తీర్చిదిద్దారు. 80 కవితలతో రూపుదిద్దిన 'ప్రాణదీపం' గ్రంథాన్ని ఆద్యంతం. కవితాత్మ కంగాను, ఆలోచనా తృకంగాను.. ఆర్తితో ఆర్ద్రంగా మలచడంలో కవి గాజోజుగారు సఫలీకృతులైనారు.

ఆయన ఇందలి కవిత్వం ద్వారా తమ అమ్మతో పెనవేసుకున్న బంధాన్ని అందరినీ కదిలించే విధంగా "ప్రాణదీపం" మొదటి కవితను తీర్చిదిద్దారు. ఆయనలో వెలు గుతున్న, ఆయనను వెలిగిస్తున్న ప్రాణదీపం అమ్మేనని వినమ్రంగా ప్రకటిస్తూ.. అమ్మకు అక్షర నీరాజనం సమర్పించారు. ఇప్పటి దాకా ముళ్ళగాయాలను నువ్వు మోసి.. పూల వాసనలను మాకు పంచావంటూ అమ్మను గుర్తు చేసుకున్నారు. నన్ను పూలు లేని కొమ్మను చేసి.. గాలికి మలిగిన వత్తివై ఆరిపోయావంటూ ఆవేదన వ్యక్తపరిచారు. చిన్ననాటి జ్ఞాపకాలను.. కవి గాజోజు తాను చూసిన అమ్మ కష్టాలను ఏకరువు పెడుతూ రాసిన పంక్తులు అందరి కళ్లు చెమ్మగిల్లే విధంగా రూపుదిద్దుకున్నాయి. దీపంతో పాటు, నువ్వూ కాలిపోతూ.. ఎన్నిరాత్రులనో కరగదీసి.. బీడీలను చుట్టి, ఊపిరితిత్తుల్ని పొగజూరిన ఉత్తి తిత్తులుగా మార్చుకున్న.. నీవేదనలోంచే కదా నాలో వేల శోధనలు వెల్లువెత్తిందంటూ.. అమ్మకు అక్షరహారతి పట్టారు. ఇప్పుడు నాకు మిగిలిందల్లా తడి యారకుండా ఉన్న నీ తలపుల తవ్విపో తలే.. నడిచే దారుల్లో నీ విలువల విత్త నాల్ని నాటుకోవడమే అంటూ కొనసాగించిన తీరు బాగుంది.

బతుకు నాకిచ్చి నువ్వెళ్లి పోయినంక
ఇప్పుడు బతుకమ్మమ పండుగవచ్చింది
ఏ వరుసలో పువ్వు పేర్చినా..
నీ నవ్వు మొకమే కనిపిస్తుందని చెప్పడం

కవి గాజోజుకు అమ్మతో పెనవేసుకున్న బంధం ఎంత గొప్పదో తెలియజెప్పే విధంగా ఈ గ్రంథంలోని మొదటి కవిత "ప్రాణ దీపం" కవితకు జీవం పోశారు.

ఊపిరి ఆగితేనే మరణం కాదనీ.. ఊహలు డిగినా నిర్జీవ దేహ శకలమేనంటూ **'విటనటనలు'** కవితలో కవి తమ తాత్త్వికతను ప్రదర్శించారు. అనుభూతుల జలపాతాలు.. అహరహరం ఉ ప్పొంగిన ప్పుడే నిరంతర ప్రవాహ చైతన్యానివవు తావని హితవు పలికారు. వీనులు విలువల దోనులవుతేనే.. సత్యం సజీవ చిత్రమై నిలుస్తుందని విడమరిచి చెప్పారు.

నదైనా.. జీవితమైనా నడిచీ నడిచీ తేటపరుచు కుంటేనే నవనాగరికతకు నాంది అంటూ 'మహా నిర్మాణవేదిక" కవిత ద్వారా తెలియజేశారు.

కరోనా నేపథ్యంలో వలసకార్మికుల వ్యథలను అద్దం పడుతూ రాసిన "ఇళ్ళు ఇల్లు చేరాలి" కవితలో ఆకలి తరిమే వేటలో నడక ఆగేదెప్పుడు? అని ప్రశ్నించారు.

ఆకలిలేని లోకాలకు సాగిపోతున్న కొత్తదారుల్ని ఈ పాదాలకు ఎవరైనా పరిచయం చేస్తారా? అంటూ మంచి ముగింపునిచ్చారు.

ఏ మట్టిలోంచి మొలకెత్తానో
ఆ మట్టికి ఎరువైనప్పుడే కదా
నేను మనిషినైనట్లు
మేను మరల కొత్త చిగురులు తొడిగినట్లు

అంటూ కవి గాజోజుగారు **"పునరుత్థాన పుష్పం"** కవితలో ప్రకటించిన భావాలు పుట్టిన ఊరుపట్ల ఉన్న మక్కువను సూచిస్తున్నాయి.

గుడైనా.. బడైనా గంట మోగితేనే భక్తి భావన ఉప్పొంగేది జ్ఞాన బోధన చిప్పిల్లేది అంటూ కరోనా నేపథ్యంలో బడులు మూసేసిన సమయాన 'బడి నారుమడి' కావాలంటూ.. రాసిన కవిత బాగుంది. చిలుకలు వాలిన చెట్టె కిలకిలా రావాల రాగాలా పనై.. రంగుల సింగిడీలు తోరణాలై రంగవల్లులై ఒదిగే పిల్లలు మళ్లీ నా కళ్ల ముందు కదలాడాలని కాంక్షించారు.

బహుభాషావేత్త డా॥ నలిమెల భాస్కర్‌గారిపై ఉన్న నెనరుతో "భాషల చెట్టు" కవితను రాశారు. ఈ కవితలో డా॥నలిమెల గారి ఉత్తమ వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించారు. కొమ్మ కొమ్మకో కమ్మని స్వరంతో పూలు వెదజల్లే సారస్వత పరిమళంతో భాషల చెట్టె భాసిల్లుతోందని కొనియాడారు. భాస్కర్‌గారి సాహితీ ప్రతిభా పాటవాలను కవితాత్మకంగా ప్రస్తావించారు.

కలిసి నడిస్తేనే తెలిసింది
కన్నీటినీ పన్నీటినీ సమంగా స్వీకరించి
కడదాకా నిలిచే తోడు తానేనని" అంటూ

ఇరవై ఏళ్ల పెళ్ళిరోజు సందర్భంగా జీవిత భాగస్వామిని ఉద్దేశిస్తూ.. "దయాపారావతం" కవితను రాశారు. పేగు బంధంతో పెనవేసుకున్న అమ్మ ఒకరైతే.. ప్రేమ బంధంతో చేరువైన ఆమె నాకు మరో అమ్మ అని చెప్పడం వారి దాంపత్య జీవితం యొక్క అన్యోన్యతను చాటుతోంది. జీవిత భాగస్వామి అమ్మనే కాదు..బతుకు బండిని సమంగా మోస్తూ బాధల్ని మునిపంటిన భరిస్తున్న కన్నీటి చెమ్మ అంటూ చక్కగా ముగించారు. భార్యపట్ల తమ గౌరవాన్ని చాటుకున్నారు.

"నిట్టాడు" కవితలో కవులు స్వాభి మానంతో సామాజిక చైతన్యం కోసం తమ రచనలు చేయాలన్న అర్థం ధ్వనించే విధంగా కవి గాజోజుగారు ప్రకటించిన భావాలు బాగున్నాయి.

కవిగా నిలబడటమంటే

నిన్ను తూకం వేసే తాయిలాల తరాజును తన్నేసి
నిన్ను లొంగదీసే నజరానాల ముఖా లపై ఉ మ్మేసి
పదవుల పద్మ వ్యూహాలను ఛేదిం చుకుని
ప్రజల పిడికిళ్ళలో ప్రశ్నలై మొలకెత్తా లని

సూచించారు. విలువల నిట్టాడువై సమాజాన్ని నిలబెట్టాలని హితవు పలికారు.

గౌరీలంకేష్ హత్యను నిరసిస్తూ **"అక్షరాన్ని కూల్చగలవా?"** అంటూ రాసిన కవితలో. నువ్వెప్పటికీ కూల్చలేనిది.. కాల్చలేనిది అక్షరం అని తేల్చిచెప్పారు. "పాటకు మరణం ఉంటుందా?" కవితలో..

నువ్వు లేవు
కానీ
పుడమి ఉన్నంత వరకు నీపాట
ఉంటుందంటూ.. కొనియాడుతూ బాలుకు అంజలులు ఘటించారు. మూగబోయిన నీ గొంతు ప్రజల నాల్కలపై పాటై ప్రతిధ్వనిస్తుందని పేర్కొన్నా రు.

నిజమే కదా!

"మరణాన్ని చిరునవ్వుతో స్వాగతిస్తా" కవితలో కవి గాజోజుగారి తాత్త్వికతను చూడగలం. మర ణాన్ని ప్రేమించడమంటే.. రణానికి నిత్యం సన్నద్ధం కావడమేనని.. జీవితమే ఓ యుద్ధ క్షేత్రమైనప్పుడు మరణం పట్ల భయమెందుకు? భ్రమలెందుకు? అని ప్రశ్నించారు.

"ధిక్కార కూడలి" కవితలో ధర్నాచౌక్ ఎత్తివేతకు నిరసనగా కవి గాజోజుగారు ప్రకటించిన భావాలు పాలకుల దమన నీతిని ఎండగట్టే విధంగా కొలువుదీరాయి. ఇప్పుడు చెవులకు తాకబోయేది నీ కంటి పాపల సైగలకు కూసీ.. మూసేకూలి కోయిలల కూని రాగాలుకాదు.. ఇవి కంచు కంఠనాదాలని నినదించారు.

"దగ్ధగీతం" కవితలో.. అన్నదాతలను ఆదుకునే ఆపన్న హస్తాలు కావాలని కాంక్షించారు. సేద్యమంటే రైతుకు పెట్టుబడి రాబడుల లెక్కలే కాదు.. సెమట సుక్క అన్నం ముద్దె అవతరించే శ్రమైక సౌందర్య.. సంబంధమని తెలియజెప్పిన తీరుబాగుంది.

చూసే కనులుండాలి కానీ
చీకటిదెంత సౌందర్యం..
రాసే మనసుండాలే కానీ
రాత్రి ఎంతటి సుందర కావ్యమంటూ "రాత్రి"

కవితను రూపుదిద్దారు–

రాతిరి
తన గర్భాన్ని వెలుతురు బాట
వ్యధా భరిత హృదయాలలో దాగిన
వేదనలకు పాడే జోల పాట
అంటూ అందమైన ముగింపునిచ్చారు.

జీవితం
మరల మరల చిగురించే వసంతోత్సవ మేనంటూ "జీవన వసంతం" కవితను తీర్చిదిద్దారు.

ముంబైకి చెందిన మచ్చ ప్రభాకర్‌గారి యాదిలో **"జ్ఞాన వృక్షం"** శీర్షికతో రాసిన కవితలో అతని కళ్ళలో మెరిసే కాంతి పుంజాలు.. మాటల్లో మర ఫిరంగుల మోతలు.. అడుగుల్లో అభ్యుదయ ప్రస్థాన ఆనవాళ్ళు– ఆలోచనల్లో కాలానికి విసిరే ప్రహేళికలు అంటూ మచ్చ ప్రభాకర్‌గారి రచనా వైచిత్రిని తెలియజెప్పారు.

చితికిపోతున్న సమాజానికి
తథా గతుడివి నాదు నీవున్నావు
చీకటి చిమ్మిన బ్రతుకుల్లో
ధర్మ పథపు వెలుగు నీవయ్యావు" అంటూ బుద్ధుని గురించి 'బుద్ధం శరణం గచ్ఛామి" కవితలో చక్కగా ఆవిష్కరించారు.

కవి గాజోజు నాగభూషణంగారు **"ప్రశ్న"** శీర్షికతో రాసిన కవితలో.. ప్రశ్నను విభిన్న కోణాల్లో విశ్లేషించారు.

ప్రశ్న..(?)

దాని ఆకృతే ఒక ఆయుధరూపమనీ సకల ఆధిపత్యాల తెగనరికే ఆచరణకది దారి దీపం అని వివరించారు. ప్రశ్నే మన అస్తిత్వ రక్షణకు అమ్ముల పొది అనీ.. ప్రశ్నతోనే ప్రజల సామూహిక చైతన్యమనీ.. ప్రశ్నలేని నాడు ప్రగతి లేదని పేర్కొన్నారు. నిజమే కదా ప్రశ్నతోనే జగతి నిత్యనూతనంగా ఉంటుంది.

జీవితమంటే
ఉత్థాన పతనాల
సంతోషాల విషాదాల సమాహారం' అంటూ **"జీవిద్దాం–యథాతథం"**గా కవితను తీర్చిదిద్దారు.

ఈమట్టిలోని ధిక్కారం
ఈ సంస్కృతిలోని మమకారం
పదపదాన సింగారించుకున్న
అచ్చతెనుగు నుడికారం
అతని కవిత్వమంతా పరుచుకున్న అద్భుత రచనా శిల్ప సౌందర్యం" అంటూ జ్ఞానపీఠ అవార్డు గ్రహీత సినారెను **"ఆ కలం"** కవితలో ఉన్నతంగా చిత్రించారు.

ఇలా ఈకవితా సంపుటిలోని అనేక పంక్తులు ఉదహరించడానికి వీలుగా ఉన్నాయి. అలతి అలతి పదాలతో అద్భుత భావాలను పండించిన కవి గాజోజుగారు అభినందనీయులు. వస్తు ఎంపికలో ఆయన చూపిన శ్రద్ధ.. అభివ్యక్తిలో ఆయన ప్రదర్శించిన ప్రతిభ ప్రశంసనీయంగా ఉంది. శిల్పం విషయంలో ఆయన చతురతను చాటుకున్నారు. వస్తు విశ్లేషణలో చూపిన చొరవ మెచ్చుకోదగిందిగా ఉంది. కవి నాగభూషణం గారి కవిత్వంలో.. ఆయన ఉత్తమ వ్యక్తిత్వం.. సున్నిత మనస్తత్వం.. సామాజిక చింతనం ముప్పేట అల్లుకుపో యాయి. చాలా కవితల్లో సమాజం కోసం.. సామాజిక చైతన్యం కోసం ఆయన పడే ఆరాటాన్ని చూస్తాం.. మసకబారుతున్న మానవ సంబంధాలకు మెరుగులు అద్దాలన్న ఆయన తపనను గమనిస్తాం.

కవిత్వ కాంతులను పంచుతూ రూపుదిద్దుకున్న **'ప్రాణదీపం'** కవితా సంపుటిని కవితల్ని చదువుదాం. ఆస్వా దిద్దాం.. గొప్ప అనుభూతిని పొందే ప్రయ త్నం చేద్దాం. ఈ సందర్భంగా కవి గాజో జుగారికి శుభాకాంక్షలు తెలియజేద్దాం. మున్ముందు మరింత గాఢమైన కవిత్వం ఆయన కలం నుండి జాలువారాలని కోరుకుందాం..

ప్రతులకు: మునిగంటి శోభారాణి
8-2-462/2. కట్ట రాంపూర్
కరీంనగర్- 505 001
సెల్: 9885462052
– దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544



మేము మనుషులం కదా...

ఊరి బయట కొండలాగ నీవు
ఊళ్ళో ఉన్న మాకు రక్షణ నీవు

ప్రకృతి సౌందర్యం నీ ఒడిలో
భూమి సమతుల్యం నీ చేతిలో

నీ రోటి పచ్చడి అమృతతుల్యం
నీ ఇసుర్రాయి పిండి వంటలు అమోఘం

యంత్రాలతో నలిగి ముక్కలైతావు నీవు
నీ గుండెల్ని చీల్చినా
బాధనుమౌనంగా భరిస్తావు

నాకు తెలుసు...
అందమైన భవనాలకు ఆకృతివి
ఆహ్లాదానికి కేరాఫ్ అడ్రస్ వి

శిల్పి చేతిలోని ఉలి దెబ్బల గాయాల్ని
కంటి కొలుకుల్లోని కన్నీటిని ఒత్తుకొని
అందమైన శిల్పంగా దర్శనమిచ్చేవు
మా ఆనందాల అనుభూతివైయ్యేవు
'కాళ్ళ కింద పరుచుకునేది నిన్నే ...'
'కళ్ళకద్దుకొని మొక్కేది నిన్నే ...'
అప్పగింతలు చేస్తాము
నీ అక్రందనలు వినలేము
ఆర్థిక సంపాదనే మా ధ్యేయం...
నిన్ను పాశాసంగా (గ్రానైట్ గా)
విదేశాలకు తరలిస్తాం...
వారికి కాసులు గుమ్మరిస్తూ
బాధతో ఈ దేశం వైపు
చివరిసారి చూసిన
నీ పచ్చికళ్ల కన్నీరు తాగేస్తాం...
కానీ,
చిన్న పిల్లలంటే
ఎందుకమ్మా అంత కోపం ?
ఓహో...
పెద్దవాళ్ళై నిన్ను అమ్మేస్తారనా...?
వాళ్ళ కాళ్ళ కడ్డుపడి
మోకాళ్ళు పగులగొడతావు....
ఇరు వర్గాల ఘర్షణకు కావాలి నీవు
వారి తలలపై నాట్యమాడేవు
నీ కన్నీటి రక్తం కళ్ళచూసేవు
కుల మతాల పట్టింపు లేదని
నిరూపించేవు
'ఏ యుగంలో ఏ పుణ్యం చేశావో...'
'అన్ని మతాల రూపాలు నీలోనే...'

నీ విలువ తెలుసుకోని మేము
మా మనస్సులను నీతో పోల్చేము
కానీ,
నీ త్యాగాన్ని గ్రహించలేము
మేము మనుషులం కదా...

–మాధవ్ గుర్రాల
94926 48887

ఋషిగా మార్చే

ఏ సముద్ర గర్భమూ
నిశ్చలంగా ఉండదు.
మనిషి జీవితంలా
పైన తరంగ సుందరం
లోన సునామీల సందడి.

స్థితప్రజ్ఞత ఓ మిథ్య
'మహాత్మా' ఓ బిరుదు!
వేదికలపై వెలిగినంత కాలమే
ఈ 'మహా.. మహా'లన్నీ
మనిషికి
మెడలను అలంకరించే 'వీర తాళ్లు
శిరస్సుకు తగిలించే కిరీటాలు!

పసికట్టలేదు ఏనాటికీ
ఏ మనిషి
మనస్సు లోతుల్ని.
అరిషడ్వర్గాల్ని సంపూర్ణంగా
అణచ గలిగే శక్తి ఉండడం
నూటికి నూరు పాల్లు అతిశయోక్తి.
మనిషి మనిషే ఎప్పుడూ!
సమాధిలోకి వెళ్లే వరకు
మనిషి వెంటే అన్నీ.
జీవితం కాదు
సదా మైదాన యానం.
ఆదర్శ స్థితిగతులు
అందమైన ఊహల ఆరోహణలు.
సాధ్యమా 'ఋషిత్వం'

రక్త మాంసాలున్న మనిషికి?
పురాణాలు ఘోషిస్తున్నాయి
కోప తాపాలు ఋషులకూ సహజమని.
చెట్టు చెట్టే..
వేపదైనా, వెంపలిదైనా.
'నేను' మేల్కొని ఉన్నంత కాలం
మనిషి మనిషే!
ఏ ప్రవచనాల ప్రయత్నమైనా
ఆ 'మనిషి' ని
ఋషిగా మార్చే దిశలోనే!

– ఆచార్య కదారు వీరారెడ్డి
9392447007

నన్ను మరువకు..

నర్సరీ అనే గర్భం లో
ప్రేమగా పెరిగిన నాకు
ఫోటో తో పబ్లిసిటీకి పొజిచ్చి
సవతి తల్లిగా పెంచకు నన్ను
ఆరంభ శూరత్వంతో నాయకులతో
గుంపులు గుంపులుగా
ఃసఊపిరి అడకుండా
నన్ను పెట్టి ఒంటరిని చేసి
మృత శిశువగా మార్చకు
నేను నిజమైన కమ్యూనిస్టిని
హ్యూమనిస్టుని
సర్వే జనో సుఖినోభావంతు కు
నిలువెత్తు సాక్షిని
ప్రేమతో నాటు... మనసుతో సాకు
తరా లు మారిన మర్చిపోను నిన్ను
నీకు పేరు పెట్టె తొట్లేను అయ్యి
నీ పెళ్లి కి పందిరిని అయ్యి
మంగళ స్నానం లో నేనై
నీ జననం నుండి
నీ చితి వరకు నేనే నేనే
ప్రకృతి సమతౌల్యతకు...
పర్యావరణ సమస్య
పారిష్కరకార్తను నేనే
ఆధారం నేనే...మార్గాన్ని నేనే
వర్షాలు రావాలన్న..
భుకోత భూతాపం తగ్గాలన్నా
నన్ను సాకు
రైతు నేస్తం...అయిర్వేదం..
ఓ మం లోని ప్రమిదను నేనే
దేశానికి సంపదై సాగుతాను నేను
అందుకు నన్ను నాటు...
ప్రేమతో సాకు
ధరిత్రికి నిజమైన నేస్తాన్ని నేను
నీ రేపటి భవితకు నేనే సోపానం
స్థితి, చర,లయ కారిణి నేనే నేనే

–వి.శేషారావు
9440408080



పక్షిలో విషమా..?

(కథ)

ఆకాశంలో స్వేచ్ఛగా ఎగురుతున్న గండభేరుండం క్రింద అనేక పక్షులు సమావేశంలో ఉండటాన్ని గమనించింది. ఒకింత కాదు ఏకంగా ఆశ్చర్యం వేసింది. ఏమిటి? ఇన్ని పక్షులు ఒకచోట చేరాయి? ఒకవేళ ఎండ తీవ్రతకు తట్టుకోలేక చేరాయా? లేక ఏదయినా పక్షి జాతిలో ఎవరికైనా తట్టుకోలేని బాధ కలిగిందా? లేదా అన్యాయం జరిగిందా? ఒకవేళ నీళ్ళు ఏక ధాటిన ఒకచోట దొరుకుతున్నాయా? ఒకవేళ ఏదయినా జరిగితే తన దాకా ఎందుకు రాలేదు? అన్నింటికంటే పెద్ద పక్షిని నేను. ఏమాత్రం గౌరవం లేకుండా ఇలా ప్రవర్తిస్తే ఇక తన గొప్పేముంటుంది? లాంటి అనేక ప్రశ్నలు గండభేరుండం తలపులోకి రావడంతో తనలోని ప్రశాంతత పోయింది. ఎగరడంలో కూడా ఏకాగ్రత చెదిరి సమానంగా ఎగరాల్సింది పోయి క్రిందకు మీదకవుతోంది. వెంటనే తేరుకుని 'అరె! నేనెందుకు కంగారు పడుతున్నాను. ఒక్కసారి క్రిందకు దిగి విషయం తెలుసుకుంటే సరిపోతుంది కదా? తినబోతూ రుచెందుకు అనుకుని ఏకంగా సమావేశం జరుగుతున్న చెట్టు పైన వాలింది.

ఇప్పుడు తనకు సమావేశం చక్కగా కనిపిస్తోంది. పైనుండి ఒక్కసారి గమనించింది. ఏవయినా మాటలు వినిపిస్తాయేమో అని రిక్కించి వినడానికి ప్రయత్నించింది. ఆశ్చర్యం ఏ పక్షీ మాట్లాడు కోవడం లేదు. మౌనంగా ఉ న్నాయి. చుట్టుపక్కల ఏ జలాశయం లేదు. తినుబండారాలు లేవు. ఇక ఎందుకు ఇలా కూర్చున్నాయి? అని తనలో తానే ప్రశ్న వేసుకుని, సమాధానం రాదని గ్రహించి ఏకంగా సమావేశం మధ్యలోకి చేరింది..

తమ మధ్యలోకి హఠాత్తుగా గండభేరుండం రావడం గమనించిన అన్ని పక్షులూ ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాయి. ముందుగా చిలుక తేరుకుని "నువ్వా! గండభేరుండ మామా! కంగారు పడ్డాము సుమా!" అంది నవ్వుతూ..

"కంగారెందుకు? అయినా ఇక్కడ సమావేశం ఏమిటి? ఎవరికోసం? ఎన్నడూ లేనిది ఏకంగా మన పక్షులన్నీ ఒకచోట చేరాయి? ఏదయినా విశేషమా? లేక విషాదమా? అడిగింది నాటక ఫక్కీలో గండభేరుండం.

ఆ మాటలు విన్న నెమలి ముందుకొచ్చి.. "ఒక రకంగా విశేషమే.. మరో రకంగా విషాదమే" అంది అటూ ఇటూ తిరుగుతూ..

"అదేంటి? ఇదేం సమాధానం? ఒకవైపు విశేషమంటూనే, మరొకవైపు విషాదం అంటున్నావు? కాస్త వివరంగా చెబుతావా? అంది ఆసక్తిని కనబరుస్తూ గండభేరుండం.

"నేనేం చెప్పగలను..? ఇదిగో వడ్రంగి, చెకుముకి చెబుతారు విను. వారయితే వివరంగా చెపుతారు. నేను ఆ చెట్టు నీడన సేద తీరాలి. అసలే ఊరికే అలసిపోతున్నాను. వృద్ధాప్యమేమో ఊరికే అలిసిపోతున్నాను." అంటూ ఒక వారగా చెట్టుకు ఆనుకుని కూర్చుంది నెమలి రెక్కలల్లార్చుకుంటూ..

చెప్పిందే తడవుగా వడ్రంగి ముందుకొచ్చి ఒక్కసారి చిలక వైపుకు చూసాయి. చిలక విషయాన్ని అర్థం చేసుకుని మాట సాయానికి పక్కనే నిలబడింది.

విషయం ప్రారంభించే ముందు కాస్త తన గొంతును సరిచేసుకుని వివరించడం ప్రారంభించింది. "గండభేరుండ మామా! ఇన్నాళ్ళూ మనం ఎవరికీ హాని చేయలేదు. ఒకవేళ చేసినా నువ్వు చేస్తావేమో? అది కూడా ఎవరైనా చనిపోతే పీక్కుతినడం లాంటివి చేస్తావు. అదేం పాపం కాదుగా.. అలాంటిది.. ఇటీవల యు–ట్యూబ్‌లో ఒక విషయం హల్‌చల్ చేస్తోంది. ఏంటంటే మన జాతిలో ఒక విషపూరితమైన పక్షి వచ్చినట్లు. దాన్ని తాకగానే మనిషి విల విల తన్నుకుని చనిపోతాడని, అది కనబడితే దూరంగా పారిపోవాలని తెలియజేస్తున్నారు.."

"విషపూరితమైన పక్షా..? ఎక్కడుందని వెతకాలి? ఉన్నట్లుండి వస్తుందా? లేక చాలా చోట్ల ఉందా? లేక మన మధ్యనే నివసిస్తోందా? లాంటి విషయాలను తెలుసుకునే ప్రయత్నం చేసారా? ఉంటే ఇన్నాళ్ళు ఎక్కడున్నాయి?" అంటూ ప్రశ్న మీద ప్రశ్నల్ని సంధించింది కంగారుగా గండభేరుండం.

ఆ ప్రశ్నలకు విసుగొచ్చిన పావురం "అబ్బ! నువ్వుండు మామా! అసలే మేము భయపడి ఛస్తున్నాం. మాకూ ఇంతకు ముందే వాట్స్‌ఆప్‌లో తెలిసింది. కాకి గూగుల్‌లోకి వెళ్ళి కనుక్కుంటే దానిపేరు పితోహి అని, అది స్వతహాగా విషపూరితమైన పక్షి కాదని, అది తినే ఆహారం మూలంగా అది విషపూరితంగా తయారవుతోందని తెలిసింది" అంది కంగారుగా.

"ఇంతకీ ఏమిటా ఆహారం?" ఆదుర్దాగా అడిగింది తీతూపిట్ట

"ఏం? తెలుసుకుని నువ్వూ తిందామనా?" అంది కోపంగా వడ్రంగి పిట్ట.

"నేనెందుకు తింటాను? నాకేమయినా విషపూరితంగా మారడం సరదానా? నేను మీ అందరితో కలిసి ఉండాలని కోరుకునే దాన్ని. ఒకవేళ విషపూరితమైతే ఒంటరిదాన్ని అయి పోనూ?" అంది తెలివిగా తీతూపిట్ట.

"సరేలే! అసలే నిన్ను చూస్తే ఏదో అశుభం జరుగుతుందని అందరూ భయపడతారు" అంది పిచ్చుక ముందుకొస్తూ

"సరే ! సరే! ఇలా ఒకరినొకరు నిందించుకుంటూ పోతే అసలు విషయం మరుగున పడిపోతుంది. ముందు ముందు మనం చేయాల్సిన పనులు, ఆచరించాల్సిన విధులు అనేకం ఉన్నాయి. అసలే ఎండలు మండిపోతున్నాయి. నీడకు, నీటికి ఎలా అనే పోరాటంతో పాటు ఇప్పుడు వస్తున్న ఈ సమస్యల్ని అధిగమించే విధానాన్ని మనం వెదకాలి తప్ప ఒకరినొకరు తగ్గించుకుంటూ పోవడం వల్ల జాతిలో వైరం తప్ప ఒరిగేది ఏమీ లేదు" అంది కాస్త కంఠం పెంచుతూ నెమలి...

"ఆ! ఇంతకీ ఆ 'పితూహి' ఆహారం ఏమిటట? తెలిస్తే ఆ ఆహారం జోలికి మేమే కాదు, ఏ పక్షీ వెళ్ళదు.. ఏమంటావు?" అంది గండభేరుండం..

"నిజమే! ఆ వివరాలు కాకి బావకు క్షుణ్ణంగా తెలుసు. అంటూ కాకి బావా! అంటూ గట్టిగా పిలిచింది పావురం..

పిలుపు విన్న కాకి..ముందుకు వచ్చి కాస్త గొంతు సవరించుకుని "నేను గూగుల్‌లో వెతికితే తెలుసుకున్న వివరం ఏమిటంటే మన జాతుల్లో కూడా 5 రకాల విషపూరితమైన పక్షులు ఉన్నాయని. కాకుంటే కొన్ని ముక్కుతో పొడిస్తే విషం వస్తుందని, కొన్ని కాళ్ళ గోళ్ళద్వారా విషాన్ని విరజిమ్ముతాయని, కొన్ని తమ లాలా జలం ద్వారా విషాన్ని వెదజల్లుతాయని, కొన్ని నిలువెల్లా విషంతో నిండి వుంటాయని. అయితే అన్ని జాతులూ మన దేశంలో లేవు. ఉండవట కూడా. వివిధ రకాల దేశాల్లో జీవించడం మూలంగా మనకు ఏ విధమైన హానికరం కాదని కూడా తెలిపారు. కాకుంటే మన దేశంలో ఉండే 'పితూహి' అనే పక్షి మాత్రం మన దేశానికి చెందినదే. అది హిరోసిన్ అనే కీటకాలను తినడం ద్వారా తన శరీరాన్ని విషపూరితంగా చేసుకుంటోందట. ఇక్కడ మరొక వింత విషయం ఒకటుంది. అదేమిటంటే మానవులు ఆ పక్షుల్ని కూడా తినేస్తారట. చేతికి గ్లౌజ్‌లు వేసుకుని ఈకల్ని పీకేసి, మిగిలిన శరీరాన్ని నిప్పులపై కాల్చి తింటారట. దానివల్ల వారికి ఏవేవో రోగాలు కొని తెచ్చుకుంటారని సమాచారం" ముగించింది కాకి.

"అయితే ఇక్కడ విద్దూరం కాకపోతే అంత విషపూరితమని తెలిసి మానవుడు ఇలా తినేయడం ఏమయినా బావుందా? మానవునికి తిండి తప్ప వేరే పని లేదు. ఉన్నవి ధ్వంసం చేయడం తప్ప వేరే వ్యాపకం ఉ ండదు. ఒకవైపు చెట్లు కొట్టేస్తారు. మరోవైపు జంతువుల్ని చంపి తినేస్తారు. పక్షులమైన మనల్ని చంపి తినేస్తారు. వారికి ఆనందం వచ్చినా, ఆవేదన వచ్చినా ఏదో ఒకదాన్ని చంపి వండుకుని ఆనందంగా తినేస్తారు" అంటూ ఒకింత విసుక్కుంది చిలక ముద్దుగా కన్నీటిని తుడుచుకుంటూ

"తినేయనీ తినేయనీ.. ఒకటి రెండుసార్లు అలాంటి విష పూరితం వారి శరీరంలోకి వెళ్ళి ప్రాణాల్ని పోగొట్టుకుంటే వారికే అర్థమవుతుంది. ఇక తినాలంటే ఏ పక్షిలో ఏ విషముందో అని తినలేక దెబ్బకి భయపడి పారిపోవాలి" అంది కోపంగా చెకుముకి.

"సరే ! సరే! వారికి తినడానికి అనేకం ఉన్నాయి. ఒకటి కాకుంటే మరొకటి. వారి తిండికేం కొదవ? కొదవ ఏదయినా ఉంటే అది మనకే. అసలు ఆ పక్షి ఎక్కడుంటుంది? రేపు దానివల్ల మనకే నష్టం రావచ్చు. అసలు ఎలా ఉంటుంది? ఆ విషయాలు తెలుసుకుంటే మనల్ని మనం కాపాడుకోవచ్చు." అంది గోరింక

ఇంతలో "అమ్మా అమ్మా! అంటూ పరుగు పరుగున వచ్చిన పావురం పిల్లను చూసి ఒక్కసారిగా అన్నీ ఉలిక్కిపడ్డాయి.

"ఏమయిందమ్మా?" అంటూ అన్నీ ఒక్కచోట చేరాయి.

"నేను ఇందాక అల్లంత దూరంలో ఉన్న సరస్సులో నీటికోసం వెళ్ళి నీరు అందక కాస్త వొంగే సరికి నేను అందులో పడిపోయాను. అంతలో ఏనుగు వచ్చి తన తొండంతో నన్ను బయటపడేసింది. నేను దాదాపుగా ఇక చనిపోయాననే అనుకున్నానమ్మా! సమయానికి ఏనుగు రావడంతో ఇలా నీ ముందుకు వచ్చాను" అంది తల్లి పక్షిని హత్తుకుపోతూ భయంతో..

వెనుకగా వస్తున్న ఏనుగుకు అన్నీ నమస్కరించాయి. జంతువుల్లో చాలా తెలివయిన వారు, మంచి సహృదయులు మీరని మాకు తెలుసు. మీరు మా జాతిని రక్షించడం నిజంగా ధన్యవాదాలు" అంది నెమలి మర్యాద పూర్వకంగా నమస్కరిస్తూ ..

ఆ మాటలకు ఏనుగు నవ్వి "ఏం తెలివిలేమ్మా! ఎంత తెలివి ఉన్నా తాగడానికి నీరు, తినడానికి ఆహారం సంపాదించుకోలేక పోతున్నాము. మీరైనా,మేమైనా కాసింత నీటిని సంపాదించు కోవాలని అనిపిస్తోంది. లేకుంటే ఈ ఎండలకి మన జాతులు అంతమైపోవడం ఖాయం" అంది పేలవంగా నవ్వుతూ..

ఆ మాటలు విన్న మయూరం ముందుకు వచ్చి "నిజమే! కానీ ఇప్పుడు మాకో సమస్య వచ్చింది. అంటూ దాదాపుగా మిగిలిన పక్షులన్నీ తమలో కలుగుతున్న భయాన్ని వివరించారు గజరాజుకి..

ఏనుగు వాటి మాటలకి ఒకింత నవ్వి.. మీరు చాలా సున్నిత హృదయులు. ఎందుకంటే విషం ఎక్కడ లేదు? మాలో లేదా? మా జంతువుల్లో కనిపించగానే చంపి తినేసే మృగరాజు జాతిలో లేదా? అలాగని

పుస్తక సమీక్ష

నైతిక విలువల్ని పెంచే బాలల కథలు

ప్రపంచం సాంకేతికంగా అభివృద్ధి సాధించిన కొద్దీ, మానవ సంబంధాలు అరుదైపోతున్నాయి. సంపాదన యావలోప డిన భార్యాభర్తలు పిల్లలను కనటానికి అయిష్టత చూపుతున్నారు. కన్నకొద్ది మంది దంపతులు తమ సంతానాన్ని మంచి మార్గంలో పెట్టడానికి సమయం చాలటం లేదు. అలా నిర్లక్ష్యం చేయబడిన పిల్లలు సెల్‌ఫోనుకో, టీవీ సీరియల్స్‌కో అతుక్కుపోతు న్నారు. నేటి బాలలే రేపటి పౌరులు. కనుక భావి పౌరుల్ని తీర్చిదిద్దేందుకు సాహితీ లోకం యావత్తూ, చిత్తశుద్ధితో నడుం బిగించాలి. కొడవటిగంటి కుటుంబ రావు, సి.నారాయణరెడ్డి, పొట్లపల్లి రామారావు మహీధర రాంమోహన్ రావు ప్రభృతులు బాల సాహిత్యాన్ని సృష్టించారు. సమకాలీన సమాజం లో డా॥ మలయశ్రీ, వేదాంతసూరి, వడ్డేపల్లి కృష్ణ తోకల రాజేశంలాంటి వారలు తమ శక్తి వంచన లేకుండా బాల సాహిత్య సృజనకు పాటుపడు తున్నారు. పలు పత్రికలు పిల్లల కొరకు ప్రత్యేక శీర్షికలు నిర్వహిస్తూ తమ వంతు బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తున్నాయి.

దారం గంగాధర్ నిజామాబాద్‌గారు 'మందారం'అన్న కలం పేరుతో ఈమధ్య రచనల్ని విరివిగా కొనసాగిస్తున్నారు. లోగడ వీరు సమాజ స్పృహతో యువతకు గొప్ప సందేశాలిచ్చే కథలను వ్రాసారు. కరోనా కష్టకాలంలో తన వంతు బాధ్యతగా, ఏకంగా వీరు 3 సంపుటులనే తీసుకు వచ్చారు.

ఇప్పుడు 'నాన్నమ్మ కథలు' అన్న శీర్షికతో 21 పిల్లల కథల సంపుటిని ప్రచురించారు. ప్రతి కథ చివర conclusion గా నూక్తులు అంద చేస్తున్నారు. మధ్య మధ్య గణితగుర్తులు వుటంకిస్తూ అవి ఇచ్చే సందేశాల్ని హైలెట్ చేసి వ్రాసారు. మిడి మిడి జ్ఞానం గలవారితో తొందరపడి వ్యాపారం చేయించకూడదు అని 'మందమతులు' అన్న కథలో నిరూపించారు. మూర్ఖుల తెరువు పోవటం మూర్ఖత్వమే అన్నకథలో పరవస్తు చిన్నయ్య సూరిలా పక్షులు జంతువులను పాత్రధారులు గా చేసి, మూర్ఖుల సాంగత్యం అసలే కూడదని పాతనీతి కథకు మళ్ళీప్రాణం పోశారు. తాతల నాటి ముంత తరతరాలకు రావాలన్న 'సెంటిమెంట్'తో కొడుకు తండ్రికి గుణపాఠం చెబుతాడు. కాలానికి నిలిచిన ఈ కథను తెలంగాణా యాసతో రాసి రక్తికట్టించారు రచయిత.

సరళమైన భాష, చిన్నచిన్న వాక్యాలతో సంపుటి అంతా పిల్లలే స్వయంగా వ్రాసుకున్నారా? అనిపించేట్లుగా ఉండటం రచయిత యొక్క ప్రతిభను 'చాటి చెబుతాయి ఈ కథలు.

కథకిచ్చిన శీర్షికలోనే 'మూర్ఖుల తెరువుపోవటం మూర్ఖత్వమే. అహం పనికి రాదు భగవంతుడు ఎవరికి దగ్గర? లాంటి శీర్షికలు చదవగానే రచయిత చెప్పదలుచు కున్నదేమో పాఠకులకు అర్థం అవుతుంది. ముడుగాలులు (31) ఇల్లాదులు (44) జ్యాదా హుష్యారీ (53) నిత్య భగోతమే (55) లాంటి పదాల వాడుక వల్ల రచయిత కథలో నేటివిటీ పెంచారు.

ఎన్నో క్రొత్త క్రొత్త సామెతలను చిన్నారులు తెలుసుకోగలుగుతారు. ఉదా॥ మొఖమే మొగిలిపువ్వు గుణమంతా గజ్జి కుక్క సుంటిదే (15) సానకు (శారీరక కుస్తీలు సర్కస్) లేత, సదువుకు ముదురు (21) మనిషికి చేసే సేవ మాధవునికే లాంటి వాక్యాలు పిల్లల జ్ఞాన పరిధి విస్తరించేం దుకు తోడ్పడుతాయి. పిల్లలలో నైతిక విలువలు, ప్రేమ తత్వాన్ని పెంపొందిచే ఈ కథలు పిల్లలకు గంగాధర్‌గారు ఇచ్చే విలువైన బహుమతులు.

ప్రతులకు: దారం గంగాధర్
ప్రశాంత నిలయం,
ఇ.నెం. 5-11-121, రైల్వే ట్రాక్ దగ్గర, యల్లమ్మగుట్ట స్ట్రీట్
నిజామాబాద్-503 001
సెల్: 9848384777

- కూర చిదంబరం
8639338675

తెలంగాణా ముద్దుబిడ్డ

పీడిత ప్రజల పక్షం వహించి
తెలంగాణ విముక్తి కొరకై
పోరు సల్పిన యోధుడు ..!
నిజాం అకృత్యాలను..
జైలు గోడల పై బొగ్గుతో
లిఖించిన ధీశాలి..!
తెలంగాణ ప్రజల కష్టాలను
"అగ్నిధార" గా మలిచి
మనకందించిన ఆదర్శవాది..!
పలు ప్రక్రియలలో ..
తనదైన ముద్రవేసి కవితా
పరిమళాలను వెదజల్లిన
తెలంగాణ కాంతి రేఖ..!
తెలంగాణ సంకెళ్లను
తన కవితా సమ్మెట లతో
బద్దలు చేస్తూ "తెలంగాణ
విమోచనమే" ధ్యేయంగా
ముందుకు నడుస్తూ..
వెనుకడుగు వేయని ..
పోరాటధ్వజం ..
"దాశరథి" ..!!

- చంచల రవి కుమార్
8500330700

ఎక్కడ ఉన్నాను ?

ఇక్కడేమిటో చీకటీ వెలుతురూ తెలియని వేళ
అక్షరాలకూ అణగారిన భావాలకూ పొంతన కుదరని క్షణం
కాస్సేపు ఆకులు రాలిన శిశిరపు పాలనలా
అతలా కుతల మవుతున్న నీటి విలయంలా
సుదూరపు చూపు చివర సూదిమొన హరితంలా
మాటలు లేని రాయబారం ఈ గాలి రెక్కలపై చెక్కి
చిత్తడి నీటిపొరల్లో చివికిన పూరెక్కలపైన
పలవరింతలుగా...
జల్లెడ పట్టి వెతికిన తూనీగల వేటలో
మబ్బుముక్కలపొదరింటి మధ్య
లేలేత పిడికిళ్ల సౌకుమార్యం
హృదయాన్ని నిమిరి పలకరించే ఓ స్పర్శ
ఎక్కడున్నాను ? ఏటి తరగల సరాగాల్నెక్కి
ఎవరికీ అంతుచిక్కని చలువ పందిరిలో
నా చుట్టూ ఒక తూర్పు సింధూరమైన
నీ ఊహల కావ్య స్వప్నలోకంలో ల
స్వయం నిర్మిత స్వర్గ సీమలో.

-స్వాతి శ్రీపాద
8297248988

విలువలు నేర్పండి బాలలకు

బీజాలను వేయుచుండుము
చక్కని భావాలతో బాలలకు.!
నిజమనేదే చెప్పుతుండు
నిజాయితీతోడ పిల్లలకు..!!

అబద్ధాలను చెప్పుకుంటు
పిల్లలనాగం చేయబోకుము..!
నిబద్ధతతో కూడుకున్న
విలువలను నేర్పిస్తుండుము..!!

పసితనములోనా చెప్పిన
మాటలే జీవితాన్ని మార్చును.!
మసిబారిన బతుకుల్లోన
వెలుగులనేవి నింపుచుండును..!!

అమ్మానాన్నల పలుకులనేవి
పిల్లల భవిష్యత్తుకు బాటలు..!
కమ్మనైన ప్రేమను పంచి
చేరేలా చూడండి గమ్యములు..!!

-పసుల.శంకర్
9542181301

కళ తప్పిన నా పల్లె ప్రగతి..!!

కుంటి కాలు తో నడుస్తోంది
గతి తప్పి కన్ను లొట్ట పోయిన నా పల్లె
సింగారం చీరతో యవ్వనపు కాంతులతో
నిత్యం ఆకర్షిస్తూ నిలుస్తుంది నగరం...

ప్రేవుల పలకరింపు గోరుముద్దలో కనికరం
ఊహల ఉట్టి లో ఊగుతుంది బాల్యపు శృతి
కానీ అంతర్జాలం వస్తువులా నేడు నేను
రేటు కట్టి నిలబడ్డా వస్తువుల కొనేందుకు...

మానవత్వపు ఛాయలో ఎండమావి నీడలా
ఆకారాన్ని మార్చుకుంటూ ప్రపంచాన్ని మింగే
సహాయం అనే పేరుతో నిస్సహాయ స్థితిలోకి
ఉచితానికి బానిసై రెట్టింపు రేటుతో కడుతూ...

ప్రపంచ కుగ్రామం కుబేరుడి అంగడి
అక్షయ పాత్రలో వస్తువు సృష్టించే
కళ్ళున్న గుడ్డివాడి చేతితో చేతి కర్ర పెట్టే
దొరికిన తాడు కోసం బర్రెను వెతికినట్లు...

అత్యాశతో మనిషి గ్రామానికి తాకట్టు పెట్టి
రెట్టింపు లాభాలకు పొలాలకూ కంచె వేసే
రెక్కలు విప్పుతూ నింగి పైకి ఎగిరే టందుకు
బంగారు పంటల నేలమ్మ ను భూస్థాపితం చేస్తూ.

ఆకాశంలోకి అశల వేర్లు విసురుతూ
భూమిపైన చిగుళ్లు కన్నీటితో నింపుతూ
తడి ఆరిన గ్రామ సీమలకు తాటిచెట్టు సహాయంలా
పరవశించిన పల్లె కొత్త వధువులా తిరగాలని ఆశ..

-కొప్పుల ప్రసాద్
9885066235

చదువు విలువ

చ- క్కని వర్ఛస్సు కలిగిన మృ
దు- వైన భావిభారత పౌరుల్లారా! బహు
వు-(పెక్కు) విజ్ఞానములు కల్గిన
వి- ద్యను ఉపాసన చేయండోయ్. అ
లు- పు లేని ఏకాగ్రతలు పెంచి, యు
వ- కిశోర విద్యా 'మూర్తి' లుగా
ఉన్నత జీవితమును గడపండోయ్.

-జంపని శ్రీనివాసమూర్తి
(జలజ)

గుర్తింపు లేని నాన్న

కుటుంబం కోసం ఎద్దులా శ్రమించడం
అవసరమైతే కొండనైనా మోసుకురావడం
పిల్లల్ని మొక్కల్లా పెంచడం
వారికి గుర్రమై వీపు మీద ఎక్కించుకొని ఆడించడం
వారికి ఏ కష్టం రాకుండా చూడడం
విద్యాబుద్ధులు చెప్పించడం
ఉద్యోగం దొరికేంత వరకు
పెళ్ళి జరిగేంత వరకు
అండగా వుండడం
తన కోసం కాక పిల్లల కోసమే బతకడం
బాధ్యతలు మోస్తూ
తన సుఖం త్యాగం చేసి
పిల్లల భవిష్యత్తును తీర్చి దిద్దే నాన్న
ఓర్పుకు నిలువెత్తు నిదర్శనం
పిల్లల ప్రతి అడుగుకి సోపానంలా
పిల్లల ఆనందంలో తన ఆనందం చూస్తూ
తను నడచిన బాట ఎలావున్నా
పిల్లలకు బంగారు బాట వేసి
తాను ఎండలో నడిచినా
పిల్లల కోసం గొడుగుపట్టిన నాన్న
ఎప్పుడూ ఏ గుర్తింపూ కోరడు

-ఎస్ .ఎమ్ .షరీఫ్
9618045319

నాన్న మనసు

సాకీ:
ఓ....శాంత మూర్తి
ఓ..అవిశ్రాంత దీప్తి
ఓ..కారుణ్య మూర్తి
ఓ..చైతన్య స్ఫూర్తి

పల్లవి:
ఆ చల్లని వెన్నెల కన్నా..
ఆ తెల్లని మల్లెల కన్నా
ఆ తరువుల త్యాగము కన్నా..
ఆ స్వాతి ముత్యము కన్నా
మా నాన్న మనసెంతో వెన్నా

కరిగే ఆ కొవ్వొత్తి కన్నా
విరిసే ఆ పూగుత్తి కన్నా
ఆడే ఆ నెమలి కన్నా
పాడే ఆ కోయిల కన్నా
మా నాన్న హృదయమే మిన్నా

మెరిసే ఆ మెరుపు కన్నా
కురిసే ఆ మేఘం కన్నా
అందాల ఆ చంద్రుని కన్నా
గంధాల సుమగనీధనీ కన్నా
మా నాన్న ప్రేమెంతో మిన్నా

వెలిగే ఆ సూర్యుని కన్నా
ఎగసే ఆ కెరటం కన్నా
వీచే ఆ తెమ్మెర కన్నా
సోకే ఆ తావి కన్నా
మా నాన్న మురిపెం మిన్నా

విరిసే హరివిల్లు కన్నా
కురిసే విరిజల్లు కన్నా
మురిసే మయూరి కన్నా
ఉరికే జలపాతం కన్నా
మా నాన్న ఘనతే మిన్నా

సుందర ఆకాశం కన్నా
మధుర మకరందం కన్నా
మాధుర్య మామిడి కన్నా
సౌందర్య సంద్రం కన్నా
మా నాన్నే మా కెంతో మిన్నా

అలరించే ఆరు ఋతువులున్నా
అల్లుకునే బంధాలెన్నున్నా
కోట్ల కొలది ఆస్తిపాస్తులున్నా
కరుణ కలుగు మనసులెన్నున్నా
మా నాన్న ముందు అంతా సున్నా

-గుండాల నరేంద్రబాబు
9493235992.

పల్లవులు..

నా హృదయంలో దాగున్నవి
ఆలోచనలు మాత్రమే కావు
నిబిడాశ్చర్యాలు..
బయటపడేవి మాత్రం కవిత్వాలే..

ఒకానొక సూర్యోదయాన వంటింట్లో
ఒక వింత అనుభూతి..
వంట చేసే అనేక పాత్రల కంటే
వడ్డించే నా పాత్రే పెద్దదనిపించింది..

అరుస్తున్న నల్ల రంగు పక్షికి
సమయం ఛాయలంటుకున్నట్లుంది..
ఆరవేసిన బట్టలపై
హెచ్చరికలు జారీచేస్తున్నాయి..

గరుకుబారిన డాబా గోడల మీద
నీడల రాక్షసుని పోరాటం
ఎంపటి నా జీవిత గమనాన్ని చూపుతూ
దృశ్యమానాలవుతున్నాయి..

తెల్లవారితే ఏదో ఒక పువ్వు పూస్తుంది
మొగ్గలన్నీ రేపటి ఆనందాన్ని తలుచుకుంటుంటే
పూచిన పువ్వేమో
తన స్థానానికై ప్రార్థన చేస్తుంది.

గాలి కాలమేమో
ఆకులన్నీ సెలవు తీసుకుంటున్నాయి
ఖాళీ కాడల మధ్య
నేనూ... నా జ్ఞాపకాలు.

మొక్కలూ.. సీతాకోక చిలుకలూ
నాకు మిగిలిన బంధాలు
బాధ్యతలన్నీ విద్యుత్ తీగలయ్యాయి.

ప్రకృతి నాకేసి ఒక్కసారి చూస్తే చాలు
ఏదో ఒకనాడు
నేనూ ఒక గాలి తెమ్మెరనై
ఆ తాలూకు పల్లవినైపోతాను..

-శైలజామిత్ర
9290900879

బడిలో గంటలు భాగ్యసిరులోయ్

ఆటపాటల తోటమాలులు
బడిలో గంటల భాగ్యసిరులోయ్!
చదువు సాగులో సంస్కరణముగ
బడిలో చేరుటె భాగ్యమోనోయ్!

పరిసరాల జ్ఞాన సిరిగను
ప్రగతి నడతకు ప్రతిభ గూర్చోయ్!
విధ్యగంధం లేని నరులకు
విలువ లేదని తెలుసుకోవోయ్!

వెనక చూసిన ఏమి కలదోయ్?
అంధ కారపు చిందులేనోయ్!
మేలుదలచియు మేలుకొనుమోయ్
బాధ్యతెంచియు భవితనేలోయ్!

పూను స్పర్థల కినుక వదిలేయ్
సోమరితొ సోపతిని మానోయ్ !
వొట్టి కబురులు కట్టిపెట్టోయ్
స్కిల్సు నేర్చుట నీదు పథమోయ్!

చదువు సంధ్యలు సాగి నడవగ
దారిలో నువు పాటు పడవోయ్!
చదివితేనే సంపదెచ్చును
తెలివి కలిమిగ తేజమౌనోయ్ !

ఈసురోమని తిరుగుటేలను?
ఏ గతేమో? ఎవరికెరుకోయ్?
కళలు నేర్చుట కాంతియౌనోయ్
జ్ఞానసాగర ధ్యానమిదోయ్!

డిగ్రిలుంటెను !ఏమిలాభం?
డిగ్నిటెంచీ మాగ్నటవ్వోయ్!
వొట్టి గొప్పలు చెప్పబోకోయ్
గట్టి మేలును తట్టి లేపోయ్!

సొంత సమయం కొంత చేర్చియు
సన్నిహితముగ చదువు చెప్పోయ్
కటిక చీకటి పారదోలే
విద్యజ్యోతియె వెలుగుజూపోయ్!

చెట్టపట్టాల్ చేతులేసుక
బడికి పిల్లలు నడువ వలెనోయ్!
జ్ఞానమార్జనె ధ్యానమెంచగ
అక్షయపు సిరి అక్షరాలోయ్!

పాఠశాలలె బాల వనముగ
కమ్మకమ్మలు నిమ్మలంబుగ
నెమరువేయుచు నీళ్ళునములుతు
కూని రాగపు కునుకుపాట్లోయ్!

హరితవనమున హాయి నీడన
ఆటపాటల తీట మాటల
తీరు ముసిముసి తీపిచూపులు
ముళ్ళెమూటల కళ్ళ చెలిమోయ్!

గుప్పుగుప్పున గుంజులాటలు
చెట్టుకొమ్మన పిట్టలోలెను
భిన్న భావపు పెంకితనముగ
రాగమేడ్పులు రంజితాలోయ్!

ఆకు మాటున దాగి కోకిల
రాగమధురిమ భోగమవగన్
బాలలబడిలొ గంటలె
శిక్షణకు సిరి మోక్షమౌనోయ్!

నేటిబాలలె మేటి భవితకు
జాగృతంబుగ జగతినేలెటి
కౌశలాలకు కర్మజ్యోతిల
భరతదేశపు భాగ్యమౌనోయ్!

-డా.పాండాల మహేశ్వర్
9912180054

పాదరక్షలు...!

చెప్పులంటె చిన్నచూపు
వాకిటిలో వాటి రూపు
పాదాలను రక్షచేసె...
వాటికింత నింద మోపు.!
విడిచిన చెప్పులా వుండు
భార్యకది మదిలో వుండు
చెప్పు స్థానమె శ్రీమతి కె
ఆడుతుంది నిన్ను చెండు.!
పాదరక్షలె పావనము
వాటితోడనె జీవనము
ముళ్ళబాధ లేకచేయు
సకలప్రజలకు రక్షణము.!
దొంగకు చెప్పే లాభము
వేసుకో పోతె లోభము
చక్కెర రోగులకు వుండు
పడితే మానదుర నిజము.!
తూష్ణీ భావమె ముప్పులు
బయటి కెళ్ళితే చెప్పులు
వేసుకొని వెళ్ళితె హాయి
చెప్పులు చెప్పవు గొప్పలు.!
చెప్పు క్రింద తేలు చచ్చు
లేకుంటె ఆపద లొచ్చు
చెప్పుకున్న గుణము మేలు
గౌరవించుటె భువి మెచ్చు.!
రఘురాముని వనవాసము
భరత పాదుక పాలనము
దేశాన్ని పరిపాలించె..
పాదుకలకే ప్రణామము..!!

-డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచారి
8555899493,

పుస్తక సమీక్ష

జీవనపయనంలో మళ్ళీ బాల్యంలోకి కవితా ప్రస్థానం

గుదిబండి వెంకటరెడ్డి-కవితా సంకలనం-బాల్యం



కళారత్న గుదిబండి వెంకటరెడ్డి, జి.వి.ఆర్. ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ చైర్మన్‌గా తెలుగునాట రెండు రాష్ట్రాలలోని సాహితీ, సాంస్కృతిక రంగానికి అవిశ్రాంతంగా సేవలు అందించే ప్రముఖ కళా రసజ్ఞునిగా మన్నలు, గుర్తింపు పొందిన కళా రాధకులు-గత 8 సంవత్సరాలుగా జన్మదినాన్ని పురస్కరించుకొని ఎన్నో కవితా సంకలనాలను ప్రచురించారు. ఈ సంవత్సరం బాల్యం కవితా సంకలనం, 81 మంది కవులు, కవయిత్రులు తమ బాల్య స్మృతులను కవితా రూపకంగా రచించే అవకాశం కల్పించి సంకలనం సంపాదకుని గా వినూత్న ప్రయోగం సఫలం చేసారు. నా 'నుడి'లో డా॥ కె.వి.రమణాచారి బాల్యం ఒక తూనీగ. యవ్వనం తేనెటీగ, వార్ధక్యం జోరీగ అంటూ కవితా సంపుటిని సంక్షిప్త పంక్తులలో జీవన పరిణామ అద్భుత అనుభవ స్మృతులు ప్రస్తావించి తిలక రేఖను అలంకరించారు. ఈ సంకలనంలో 81 కవితలలో 33 కవితలు మహిళా రచయిత్రులవి చోటుచేసుకొన్నాయి. డా॥ గోవరాజు రవికుమార్, మహమ్మద్ అప్సరవలీషా వలమ్లేటి గీతాలక్ష్మి, ఆసూరి ఉషారాణి, ఎమ్.డి. ఖాజామైనద్దీన్, తాటికోల పద్మావతి, శ్రావణి బోయిని, వీధి బాలల దైన్యజీవన విషాద స్థితిగతుల్ని కవితా వస్తువుగా స్పృశించారు. అధిక సంఖ్యలో తమ జీవితాలలో బాల్యం ప్రసాదించిన మదుర స్మృతులను కవితాపరంగా గుర్తు చేసుకొన్నారు. కొందరు కేవలం బాల్యం ఇతివృత్తంగా తమ కవితలను తీర్చిదిద్దారు. బాల్యం మళ్ళీ కొందరు ఆహ్వానిస్తే, బంగారు బాల్యం బంధాలులేని అమాయక బాల్యం, వాసన వీడని పువ్వే బాల్యం అంటూ కొందరు తమ జ్ఞాపకాలను వ్యక్తీకరించారు. పి. పంకజ మల్లిక్ "అప్పుడెప్పుడో చిన్నతనాన పోయిన 'చిల్లికాని' కోసం ఈనాడి సకలో వెతికినట్టి నాబాల్యం వెతక్కుంటున్నాను" యించుమించు అందరూ జారిపోయిన బాల్యంలోకి మళ్ళీ వెతుక్కుంటూ ఆ చెరగని అనుభూతులను కవితా చిత్రాలుగా సృష్టించారు. బాలకార్మికులు, బాల్యవివాహాలు, కుటుంబ, సమాజపరంగా నిరుపేద బాల బాలికల జీవనవేదన, ముఖ్యంగా బాలికల పేదరికం, ఆలనా పాలనాలేని ఆర్థిక దుస్థితిలో పడే కష్టాలు, కన్నీళ్లు కవితా రూపకంగా చదువరులను కరిగించే ఆలోచనలు చోటు చేసుకోలేదు. ఏది ఏమైనా గుదిబండి వెంకటరెడ్డి సాహితీకృషికి అభినందనీయులు.

ప్రతులకు:
శ్రీమతి జి. భవానీరెడ్డి
బి70/ఎఫ్1, పి.ఎస్.నగర్
విజయనగర్ కాలనీ
హైదరాబాద్-500057
సెల్: 98498 82783

-జయసూర్య
9440664610

నువ్వొక.....

ఇప్పటికైనా కాస్త కళ్లు తెరువు
ఇప్పటికైనా కాస్త పరికించి చూడు
నీ నీడ నీవెంట లేదిప్పుడు
నీ మనసు నిన్నంటిపెట్టుకొనిలేదిప్పుడు

నీ ప్రమేయం లేకుండానే
నీ దేహం వాళ్ళ పంచన చేరింది
నీ అనుమతి లేకుండానే
నీ భుజాలు వాళ్ళ పల్లకీలు మోస్తున్నాయి
నీ ఆదేశం లేకుండానే
నీ గొంతు వాళ్ళ భజనగీతాలు పాడుతుంది

వాళ్ళేసే రూపాయల బిస్కెట్టులకు
నీ నోరు రుచిమరిగింది
వాళ్ళు చూపే కపటప్రేమల వలలకు
నీ దేహం చిక్కుబడిపోయింది
వాళ్లు ఎడమకాలితో తన్నే పీటలపై
నీ అస్థిత్వం కుదేలై కూర్చుంది

నిజానికి నీకిప్పుడు ఏ రూపూ లేదు
ఏ రంగూ లేదు
ఇప్పుడు నువ్వు
ఓట్లపండుగలో బలైపోవడానికి
సిద్ధంగావున్న ఓ బలిపశువువి
వ్యక్తిత్వ పరిమళంలేని ఓ వెర్రిపుష్పానివి
నీవాళ్ళకోసమైనా నీవు చిగురించని
ఓ మోడుబారిన వృక్షానివి
ఐదేళ్ళకో అవకాశమిచ్చినా
నిన్ను నువ్వు ఋజువు చేసుకోలేని ఓ జీవశ్చవానివి
నిజాల నిప్పుల్లో పుటంపెడితేగానీ
స్వచ్ఛంగా బయటకురాని ఓ స్వర్ణసాదృశ్యానివి

-ఎన్.నరేశ్ చారి
9701334516

నా ఊరు

ఊరిపిరిపోసుకున్నది అక్కడే
ఊహ తెలిసిందక్కడే !
ఆట నేర్చుకున్నది అక్కడే
మాటతెలిసింది అక్కడే!!

పడి లేచింది అక్కడే
లేచి పరిగెత్తింది అక్కడే!
కష్టాల కౌగిలింతలు కొన్ని
ఆనందపు గిలిగింతలు ఎన్నో!!

బ్రతుకు కోసం బస్తీబాటపట్టి
అనునిత్యం కుస్తీపట్టి!
ఆటుపోట్లు చూచి
ఎత్తుపల్లాలు చవిచూచి !!
అనంత ఆరాటం తో
అవిశ్రాంత పోరాటం చేసి
అలసిపోయిన నన్ను....

ఆహ్వానించి ఆదరించింది
ప్రేమతో కౌగిలిచ్చింది!
చేరదీసి తన ఒడిలో
సేద తీర్చుకొమ్మంది !!

నా ఊరు...
నేను ఊపిరి పోసుకున్న ఊరు !
నేడు ఊరట పొందుతున్న
ఊరు !!

-జగ్గయ్య.జి
9849525802

నిర్మలత్వం నిర్మిద్దాం

ఆనందమేఆస్తి
సంతోషమేసంపద
ఆత్మీయతేపెట్టుబడి
అభిమానమేఅడ్రస్
ఆప్యాయతేమూలధనం
అనురాగమేఆభరణం
చిరునవ్వే?భూషణం
సమన్వయమే కార్యాచరణ
సంఘీభావమే సమైక్యత
మనోధైర్యమేఆయుధం
సంకల్పమేసక్సెస్
అవగాహనేఆర్థత
ప్రేమతోబంధాలు
బంధాలతోఅనుబంధాలు
అనుబంధాలతోఆత్మీయత
మమతమనిసితనంతో
మానవీయపరిమళాలను వెదజల్లుదాం
ప్రగతితోపురోగమిస్తు
ఉప్పొంగేఉత్సాహంతో
ఉరుకులపరుగులజీవితాలలో
నిర్మలత్వంనిర్మిద్దాం
ప్రశాంతతకుపట్టంకడుదాం
శాంతిసౌభాగ్యాలతోటలో
ప్రగతిశీలసమాజాన్నినిర్మిద్దాం

-నేదునూరి కనకయ్య
9440245771

75 యేళ్ళభారతం-ఉగ్రవాదం - అనుసరించాల్సిన విధానం

దేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను అర్పించిన మహనీయులు యువకులుగా జైలు జీవితాన్ని గడిపి దేశం కోసం ప్రాణాలర్పించిన వారికి, ఉరికంబాన్ని ఎక్కిన వారికి, సత్యాగ్రహం ద్వారా అహింసాయుత పోరాట ప్రేరణను దేశ ప్రజలలో నింపిన వారందరికీవందనాలు .బాపూజీ నాయకత్వంలో దేశ స్వాతంత్ర్యాన్ని పొందింది. అలాగే స్వాతంత్ర్యానంతరం ఎంతోమంది దేశంలో శాంతి, సంపన్నత, భద్రతలకు కృషి చేశారు. స్వతంత్ర భారతావని ప్రజల ఆకాంక్షలునెరవేర్చడానికీ, అభివృద్ధికీ,శాంతికీ,సుసంపన్నతకు కృషిచేసిన వారందరికీ అభివందనాలు.

దేశ ప్రగతితో పాటు శాంతిభద్రతలకు మనం నేడు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నాం. ప్రపంచంలో పలు దేశాలు అనేకానేక అభద్రతల నడుమ కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రపంచంలో ఎక్కడో ఒకచోట మరణ దేవత నిరంతరం విహరిస్తూనే ఉంది. ఈ పరిస్థితుల నడుమ ప్రపంచ శాంతికి భారత్ కీలక పాత్ర పోషించాల్సి ఉంది. ఉగ్రవాద సంస్థలపై మనం తీవ్రంగా పోరాడుతున్నాము. ప్రపంచంలోని ఏ మూలనైనా ఉగ్రవాద దుశ్చర్య

ఎలాంటిదైనా దాన్ని మానవాళిపై దాడి గానే పరిగణించాలి. అందువల్ల ఉగ్రవాద మూకలకు ఆశ్రయమిచ్చి ప్రోత్సహిస్తున్న వారికి వ్యతిరేకంగా సకలశక్తులూ ఏకం కావాల్సిన అవసరమున్నది. మానవాళి వ్యతిరేక కార్యకలాపాలను ఎండగట్టడంలో భారత్ తన వంతు పాత్ర పోషించాలి. అదే సమయంలో ఉగ్రవాదం అంతానికి ప్రపంచ శక్తులను కృతనిశ్చయంతో ఏకతాటిపైకి తేవాలి.

ఉగ్రవాద సంస్థలు భారతదేశాన్ని లక్ష్యం చేసుకోవడమే కాకుండా మన పొరుగు దేశాల్లోనూ విధ్వంసం సృష్టిస్తున్నాయి. బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ కూడా ఉగ్రవాద దుశ్చర్యల ఫలితంగా ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. కాబట్టి ఉపఖండంలో శాంతి,భద్రత, సామరస్యాలకు భరోసా ఇచ్చే విధంగా మనమంతా ఏకమై చురుగ్గా వ్యవహరించాల్సి ఉంది. భయాన్ని హింసను వ్యాపింపజేసే శక్తులను మట్టి కరిపించాలన్నది మన సుస్పష్ట విధానం. ఆ మేరకు మన సైన్యం, సరిహద్దు భద్రతా బలగాలు, భద్రతా సంస్థలు ప్రశంసనీయంగా పనిచేస్తున్నాయి. సంస్కరణల దిశగానూ మనం సకాలంలో ముందుకు వెళ్లడం కూడా అంతే ముఖ్యం. సైనిక మౌలిక సదుపాయాలు, సైనిక బలగాలు, సైనిక వనరుల విషయంలో సంస్కరణలతో ముందుకు సాగుతున్నాం.

మన నావికాదళం, సైన్యం వాయుసేనల మధ్య సమన్వయంపై సందేహాలకు తావేలేదు. మన సైనిక దళాలు అమరిక మనకెంతో గర్వకారణం. భారత సైన్యం ఆధునీకరణపై తమదైన శైలిని అనుసరించేందుకు వారు కృషి చేస్తారు. కానీ నేడు యుద్ధ సంభావ్య పరిస్థితులు, శైలీ మారినాయి. నేడు ఇవన్నీ సాంకేతిక పరిజ్ఞానచోదితంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో మన సైనిక శక్తి మొత్తం ఏకీకృతమై ముందుకు సాగాలి. ప్రపంచ వ్యాప్తంగా మారుతున్న యుద్ధ భద్రత పర్యావరణానికి అనుగుణంగా ఉండాలి. అందుకే త్రివిధ దళాధిపతిని నియమించాం. ఈ హోదాను సృష్టించాక త్రివిధ దళాలకు సమర్థ అగ్రనాయకత్వం అందుబాటులోకి వచ్చింది. ప్రపంచంలో హిందుస్థాన్ వ్యూహాత్మక వేగాన్ని సంస్కరించే స్వప్న సాకారం దిశగా సిడిఎస్ వ్యవస్థ ముఖ్యమైనది.

మన లక్ష్యాలు హిమాలయాలంత సమున్నతమైనవే. నక్షత్రాల కంటే లెక్కకు మిక్కిలైనవి మన కలలు. ఇది మన సంకల్పం. హిందూ మహాసముద్రం వలె కొలవడానికి వీలు లేనిది మన సామర్థ్యం. మనం నిరంతరం కొనసాగించే ప్రయత్నాలు మన దేశంలో ప్రవహిస్తున్న గంగానది వలే పవిత్రమైనవి. మన విలువలు,మన దేశ పౌరుల త్యాగాలూ మనకు ప్రేరణగా ఉన్నాయి. భారతీయ తత్వం, భారతీయ జీవన విధానం, భారతీయ సంస్కృతి లోనే అహింస, సహనం, సామరస్యం దాగిఉన్నాయి. ఆ మార్గంలోనే విశ్వశాంతి సాధ్యమవుతుంది. రండి ఆశయాలను, సంకల్పాలను మనసులో ఉంచుకొని నూతన భారతదేశాన్ని నిర్మిద్దాం. బాధ్యతలను నెరవేరుస్తూ, నూతన విశ్వాసంతో, నూతన సంకల్పంతో నవ భారత నిర్మాణం మన మంత్రం కావాలి. ఈ ఒక్క ఆకాంక్షతోనే మనం కలసి మనదేశాన్ని ముందుకు తీసుకువెళుదాం.

-పిల్లి.హజరత్తయ్య,
9848606573

యశోదారెడ్డి పల్లె ముచ్చట్ల కతలు

ఆమె వొడువని ముచ్చట్లు పందిరి కింద
పలుకుబడుల బడిజెప్పిన పంతులమ్మ !
కతల తోటలల్ల సాలెల్ల కుహుకుహులు పాడిన కోయిలమ్మ !
తీరొక్క పదాలతో పూలను పేర్చి తీర్చిన బతుకమ్మ !
తెలుగు సాహితీ ఆకసాన విరిసిన అందాల సింగిడమ్మ!
విలక్షణ రచనా సౌరభాలు విరజిమ్మిన వెన్నెలమ్మ !
బెత్తంబట్టి బుద్ధిజ్ఞానాలను విద్యార్థులకు నేర్పిన టిచరమ్మ !
కత్తి కాశిరెడ్డి – సరస్వతమ్మలుకన్న పాలమూరు బంగారుబొమ్మ !
పాండిత్యం పరిశోధనల అక్షర నిధి జ్ఞాన జలధి
ఈ మూడు తరాల ముత్తవ్వ ! పాకాల యశోదమ్మ !

నా తెలంగాణ తల్లి భాషా సంస్కృతులకు హారతులు పట్టి, తియ్యని జున్నుపాలతోఅరగింపులు చేసి అడిగిన వారికి ఆమెతలను వడ్డించిన కథకులు, విమర్శకులు, పరిశోధకులు వెరసి భాషా పండితులు యశోదారెడ్డి. ఆమె ఉపన్యాసం ఆపాతమధురం, అది వాక్ప్రవాహమై అలరించేది. ఆమె రచనలు ప్రవాహ ఉరవడితో ఉరకలెత్తేవి.

తెలంగాణా పల్లె భాషలో వంకలు తిరుగుతూ వన్నె చిన్నెలు పోయే వాగుల వయ్యారాలూ. ఆ పల్లెల ప్రకృతి సొగసులూ, భాషా విశేషాలతో భావ ఉద్భవితో కొనసాగించినవి ఆమె కథలు.. ఆ కథల నిండా పల్లె జనం ముచ్చట్లు. ఆ కథలకు వస్తువు ఎక్కడినుండో ఊడిపడలేదు, తను పుట్టి పెరిగిన పల్లెసీమలూ, కొండవాగులూ, గోగుచేన్లూ, చెట్లూ, గట్లూ, గుట్టలూ.. తన మస్తిష్కంలో చేరిన స్మృతి జ్ఞానంతో జతపరిచి భూమికను కూర్చుకొని కొంత విషయం నేర్చుకొని.. తనదైన శైలిని అలవర్చుకొని ఆమె కథా రచన చేసారు. సహజమైన రచనా శిల్ప సామర్థ్యాలతో ఆ కథలను రమణీయంగా మలిచారు. అందుకే ఆమె రాసిన 'కథ' నేల విడిచి సాము చేయలేదు.

పాఠకుల్ని తెలంగాణా పల్లె వాకిట్లోకి తోడ్కొనిపోయి ఆ కథలు వాటినవే ఆస్వాదింపజేస్తూ, కేరింతలు కొట్టిస్తూ ఉల్లాసంగా ఒకింత ఆశ్చర్యచకితం చేస్తాయి. తీరొక్క ముచ్చట్ల గూటిలో కిచకిలాడే పిట్టల్లా సందడి చేస్తాయి.

ఆ కథలనిండ ముచ్చట్లే ముచ్చట్లు. ఆమె వ్యక్తిత్వం కూడా ముచ్చట్ల వందిరి కింద కూచోబెట్టి కథల రాశులు పోసి, పగలూ రాత్రీ అనే సోయి లేకుండా కథా విపంచి మీటుతూ కచేరీ కొనసాగించేది.

రచయిత్రి ఆస్తిత్వం అచ్చమైన తెలంగాణా పల్లె అస్తిత్వం. పల్లె గర్భంలోంచి రాలి పల్లె ఒడిలోచేరి నిండా పల్లెతనాన్ని ఆవాహన చేసుకున్న ఆమె, గ్రామీణ వాతావరణం, సాంఘిక పరిస్థితులు, గ్రామాల్లోని రాజకీయాలు, గ్రామీణ సంస్కృతి, సబ్బండ జాతుల జీవన చిత్రణ తన కథల్లో చేసారు. అవి సాధారణ పల్లె జీవితాలకు సంబంధించినవే. కథనం గుమ్మపాల వెచ్చదనం గడ్డ పెరుగు తియ్యదనంలా ఊరిస్తుంది.

కుండెడు పాలలో ఒక్క ఉప్పుగల్ల వేసినా ఆ పాలు విరిగిపోతాయి.. కానీ నిండు పాలకుండలో తేనె చుక్కలేసినట్లుగా ఉంటాయి యశోదారెడ్డి కథలు.

తెలంగాణా ఇండ్లల్లో చేసుకునే పచ్చిపులుసు రుచితో, నిప్పులమాద కాల్చిన జొన్నరొట్టెల్ని ఎల్లిపాయికారంలో నూనె పోసుకొని తింటుంటే కమ్మని ఆస్వాదన.. ఆకలి తీరుతున్న కడుపు నెమ్మది.. మనసు చల్లని చెరువు కుంటల్లోకి దిగి అల్లి, కలువ, తామరపూలను దూసుకొస్తున్న సంబరంతో (ఇట్ల చెప్పుకుంటబోతే ఈడనే రాత్రి తెల్లవారుతది) ఎవరికి వారు చదువుతుంటే కాజు, బాదం, సారపప్పులేసి యాలక్కయ పొడిజల్లి నేతిల వేయించిన సేమ్యాను కాచి జుర్రుకుంటున్న అనుభూతి సొంతమైతది..

యశోదారెడ్డి ఊరు మనిషి. ఆ ఊరు మనిషి రాసిన ఊరుమీది ముచ్చట్ల నిండా పొదిగిన ఊరు విశేషాలు. ఆ విశేషాలలో ధ్వనించే అభ్యుదయ – సంస్కరణా – ఆదర్శ దృక్పథాలు. వాస్తవికతను దాటి కాల్పనిక కథానైజంతో కొన్ని అడుగులు ముందుకుపోయిన ఆదర్శ భావాలు.

కుటుంబ బంధుత్వాల ముచ్చట్లు... రాజకీయాల ముచ్చట్లు ఉపమానాలతో ముచ్చట్లు.. రాజకీయాల ముచ్చట్లు ఉపమానాలతో ఊపరాడనియ్యని ముచ్చట్లు, సామెతల చమత్కారాలు గుప్పించే ముచ్చట్లు.. జాతీయాలూ, నుడికారాలూ, పలుకుబడులూ, పదబంధాల జుగల్ బందీలు దృశ్యీకరించే ముచ్చట్లు. అన్నీ ఈ ప్రాంతపు భాషా సంస్కృతులకు అద్దంపట్టే ముచ్చట్లు.

యశోదారెడ్డి రచనశైలి ఎక్కువగా సర్వసాక్షి కథన రీతిలో ఉండి కథకు కావలసిన అన్ని అమరికలూ విలక్షణంగా ఉంటాయి. ఇంగ ఆమె కథల్లోని తెలంగాణ పల్లె ముచ్చట్లను తెలుసుకుందాం

గ్రామీణ సాంఘిక పరిస్థితులు – కుటుంబ బాంధవ్యాలు :

యశోదారెడ్డి రాసిన కథల్లో ఈ అంశానికి చెందిన 'మాన్యరికం', 'గంగరేగి చెట్టు' కథలను ప్రధానంగా ప్రస్తావించాలి. ఎనభై ఏళ్ల క్రితం నాటి తెలంగాణా సమాజంలో మ్యానరికపు పెళ్ళిళ్లు నిర్బంధపు ఆచారంగా ఉండేవి. ఒక ఇంటి ఆడబిడ్డ మరొక ఇంటికి వివాహానంతరం వెళ్ళినా ఆమె పుట్టింటి వాళ్ళు ఈ మ్యానరికపు పెళ్ళి ద్వారా మళ్ళీ సంబంధం కలుపుకొని ఆ బంధాన్ని దృఢంగా చేసుకునేందుకు మ్యానరికాన్ని తప్పకుండా అమలుపర్చుకునేవాళ్ళు. అది జరగని పక్షంలో అవమానంగా భావించేవాళ్ళు.

ఒక పండుగనాడు అన్న కేశవయ్య పదేండ్ల బిడ్డ లక్ష్మిని తన కొడుకు తిరుపతికిచ్చి పెండ్లి చేయమని అడిగి, ఖాయం చేసుకునేందుకు కమలమ్మ పుట్టింటికి పోతుంది. అక్కడ కోడలు లక్ష్మిని కూర్చోబెట్టుకొని "రెండు జడలిడ్సి, ఎంటికలు పాపి పాపి, ఊదునూనె మెరుగువెట్టింది, ఒంటి జేడసింది, పూలగొట్టంతోటి జడనిండా పూలు గుచ్చింది, చెవులకు గున్నాలువెట్టింది, చేతికి కాకరకాయ గొలుసులువేట్టింది, మొఖానికి పౌడరు ఏసింది, కాటిక కడ కొలుకులు దాటంగ దీధి సాధు చుక్క వెట్టింది. పిల్లను తీర్చిన బొమ్మాలే చేసి కమలమ్మ కోడలి గదువ చేతులకు దీసికొని 'నా పండు' 'చంద్రదీపం' ! అని ముద్దిచ్చుకొని ఆ పిల్లను అటు జరిపి కొడుకు తిరుపతిని కూడా లక్ష్మిని తయారు చేసినట్లే ఆడపిల్లలా తయారు చేస్తుంది.

తరవాత వేదో మాట మీద వదినామరదళ్ల సరసాలు వికటించి కమలమ్మ రోషానికి వస్తుంది. ఇంటెనుక లక్ష్మితో కలిసి తిరుపతి తన దేవునిజుట్టుకు తల్లివేసిన జడను కత్తిరించుకొని ఏల్లదొల ఆట ఆడుకోవడం చూసిన కమలమ్మకు కడుపు మండుతుంది. కొడుకును లాక్కపోతూ "దేవుని మొక్కు ఆ విధంగా కత్తిరించుకునేందుకు నీకెంత నాదాని వచ్చె నాయనా ? ఆ పోరి నీద నీ మీద పడోద్దు" అంటూ వాళ్ళ ఊరికి తిరుగు ప్రయాణం కావడానికి బయటకు వస్తుంది. బండి కట్టించమని అన్న కేశవయ్యతో అంటుంది. అన్న కేశవయ్య పసిపిల్లలు దేవునిలాంటి వాళ్ళనీ, నిదానం చేయమని ఆ పూటకు ఉండమని చెల్లెలిని బ్రతిమిలాడుతాడు. వొదిన రాధమ్మ కూడా పట్టు విడువండని బ్రతిమిలాడుతుంది. ముగ్గురూ కళ్ళు తుడుచుకుంటూ పిల్లల చేతులు పట్టుకొని ఇంట్లోకి పోతారు. 'మ్యానరికం' కథలాగే 'గంగరేగిచెట్టు' కథ కూడా రచయిత్రి స్వీయకథే. అది కూడా మేనరికానికి సంబంధించినదే. ఒక పండుగనాడు పుట్టింటికి వచ్చిన ఆడబిడ్డ తన అన్న బిడ్డా తల్లిలేని ఎచ్చమ్మను అన్ని మాటమీద తన కొడుకు రాగయ్యకు చేసుకోడానికి ఒప్పుకుంటుంది. కాని మేనకోడలు ఎచ్చమ్మ పిల్ల చేష్టలూ, చిలిపి ఆటలూ గమనించి కోపగించుకొని "నాకు మీ సమ్మందమే వద్దు కచ్చురం గట్టియ్యి నేపోతా" అన్ని అన్నతో అంటూ తన ఊరికి పయనం అవుతుంది. దానికి ఎచ్చమ్మ తండ్రి కాశిరెడ్డి బాధపడుతూ బయటికి వెళ్ళిపోతాడు.

నాటి ప్యూడల్ సమాజంలో అగ్రకూలాల్లో భూస్వామ్య – పితృస్వామ్య భావజాలం ఏ విధంగా సమాజాన్నీ గ్రామీణ వ్యవస్థనూ ప్రభావితం చేసేదో ఈ కథల్లో కుటుంబ బాంధవ్యాల కథనం కూర్చి చిత్రించారు. సమాజంలోని నమ్మకాలూ, ఆచారాలూ, ఆనవాయితీలూ, మర్యాదలూ, వేడుకలూ, ఆడపిల్లల పట్ల వివక్షతలూ లాంటి అంశాలను ఈ కథల్లో దృశ్యమానం చేసారు రచయిత్రి.

గ్రామీణ సంస్కృతి (పండుగలు, తంతులు) :

విదేశాల్లో ఉన్న అక్కాబావలకు తెలంగాణ పల్లెల్లో ఉన్న చెల్లెలు తమ పల్లెలో ఆ ఏడు జరిగిన దసరా పండుగ విశేషాలను కమనీయమైన శైలిలో పాలపండ్లు తింటున్న రసాస్వాదనతో, భాషా భావనలను పూసగుచ్చిన కథలాగా ఉత్తరంలో రాస్తుంది. అది చూసిన బావ రఘు భార్య ముక్తతో " ఆ మాటల పిట్ట తెలంగాణపు పలుకుబడినంతా పొదిగి సూతారంగా దండలల్లి గింపలకెత్తి పంపి ఉంటుంది అంటాడు. "తేనె పేరులవంటి తెలంగాణా సిసలైన తెలుగు మాట తీపి చూడండి" అంటూ ముక్త చెల్లెలు రాసిన ఉత్తరం చదవనారంభిస్తుంది.

జాదూఘర్ లాంటి అమెరికా మహానగర సముదాయాల్లో ఉంటున్న తెలుగువాళ్ళు కలిసి మెలిసి తెలుగు సాంస్కృతిక వేదుకల్లో, కార్యక్రమాల్లో పాల్గొనడం దగ్గరనుండి ఇక్కడ మనవాళ్ళు రాను రాను భాషా సంస్కృతులను విస్మరిస్తున్న తీరు పట్ల విచారిస్తూ ములుసూపుతున్న రాజకీయాలనూ అటు ఇటు కాకుండా త్రిశంకు స్వర్గాన్ని నిర్మించే ప్రయత్నాలను ప్రస్తావిస్తూ 'దసరా పండుగ' గురించి వివరంగా మాట్లాడుతుంది.

ఆ ఊరిలో ఆడవాళ్ళు వైభవంగా జరుపుకునే బతుకమ్మ వేడుక, మగవారి దసరా వేడుక గురించి రాస్తూ ఆ పండుగను 'పూల పండుగ అని', 'ఆటపాటల పండుగని', 'పొలిమేర దాటు పండుగనీ', 'విజయ ప్రస్థానపు వేళ ఆయుధ పూజోత్సవం అని', 'అపరాజితాదేవి కొలువు' అని, 'ముగ్గురమ్మల పండుగ' అని, 'ఆదిశక్తి విశ్వరూప వైభవం' అని చెప్తూ ఎవరి తాహతులను గుర్తించి వారు వ్యక్తిగతంగా సామూహికంగా జరుపుకుంటారు. ఈ సారి కూడా అదే విధంగా జరిగినా దాని రంగూ రుచీ మారిందని చెబుతుంది.

తమ ఊరవతల కొండగట్టున ఉన్న ఊరి చెరువు కాడికి రివాజుపొంటి జమ్మికొసం పోయిన మొగోళ్ళందరు చేతులు చేతులు కలుపుకొని ఒకరినొకరు ఆలింగనం చేసుకోని బంగారం (జమ్మాకు) ఇచ్చి పుచ్చుకొని కడుపునిండా నగి మురిసింద్రు, చెండాటలాడి గెలిసినోళ్ళకు ఇనాములు పంచింద్రు.

ఈ సారి మనూరికి 'సర్పంచి' అగ్రకులంలోనివాడు కాకుండా వెనుకబడిన కులాలవ్యక్తి అయ్యిండనీ, సర్పంచి రాజు చదువుకున్నోడని, మంచీమర్యాద ఉన్నోడనీ, ఎల్తిబుద్దులు లేనోడని సంతోషంగా చెప్తుంది.

అంతా సమంగా అందరూ సమానంగా అయ్యేదినం కనుచూపుమేర కానవస్తలేదని. "అన్నీ నూనె బుడ్డి మీద రాతలేనని అక్కడ కొండగట్టున కూర్చునోళ్లలో ఒకరంటే ఈ పండుగపూట లొల్లి పుట్టిస్తరా అని మరొకరు మండలిస్తరు. చేతికున్న ఐదేళ్ళు ఒక్క సమానంగా ఉన్నయా అని ఒకరూ, పరీక్షలల్లా నూటికి నూరొచ్చినా, నూటికి ముప్పైఅయిదు మార్కులొచ్చినా కామ్యాబ్ కదా ? అని ఒకరు రాజకీయాలు మాట్లాడుతుంటారు.

అన్ని ఇంటున్న హరికథ బాపనయ్య నడుమ కలుగజేసుకొని "మనం మాట్లాడిన మాటలన్ని అకాశాన అంటే మొగులు మీద శబ్ద బ్రహ్మయ్య కాడ ఉంటాయి. అట్ల లేకపోతే ఇయ్యాల ఈ రేడియో, టి.వి గీవి ఎట్లోస్తుండె? యాదో మాట్లాడి గడిసనంట అని సేతులు దులుపుకోకుండి" అంటూ పత్తెం జెప్పిండు అని రాస్తుంది రచయిత్రి.

ఈ సమావేశంలో విషయం జ్ఞానమిచే చదువుల కాడికి కూడా పోతుంది. ఈ విధంగా చదువులూ రాజకీయాలూ లీడరీలు, వేషాలుమార్చుడు సంఘాలూ సభలూ, సాహిత్యాలూ వీటన్నింటి మీద రకరకాల సామెతలు నుడికారపు పద బంధాలతో చమత్కారపు భాషలో అక్కడ జరిగిన చర్చలూ వాదాలనూ చెప్తుంది ఆ ఉత్తరంలో.. అక్కడున్న పిల్లలు పెద్దలను నిలువరించి మాకు దీవెనలియ్యండని జమ్మివెట్టి పెద్దోల్ల కాళ్ళకు దండం పెట్టేదాకా నడుస్తుంది చర్చావేదిక పెద్దలు పిల్లగాండ్ల నుండి జమ్మిని, మొక్కులను అందుకొని సంబరంగా వాళ్ళను దీవిస్తరు. మొన్నటి 'దసరా' నడిసిన తీరు ఇది అక్కా ఇదే కథ మరి బావ ఏమంటడో అని ఆ ముచ్చటను ముగిస్తుంది రచయిత్రి.

"అడిగిన వారిని ఆమెతలు వెట్టు నా తెలుగు తీయందనమునకు" అంటూ జాతి సంస్కృతికి ఆయువుపట్టువంటి భాషను పండించిన కథకురాలు **"జమ్మికథ"**ను కూడా తన ఊరి ముచ్చట్లలో నింపి అందించారు. కాల్చిన తాటి పండు ఘుమఘుమలు, గుమ్మలకొద్దీ తోడుకున్నా తరగని మన పదాలు, విరగకాసిన పరిపంట అందాలు. రెండు చేతులూ వెన్నముద్దలు తినడమే తరువాయి అన్నట్లుగా ఉంటుంది.

"పీర్ల పండుగ" కథలో ఒక ఊరిలోని సమస్త జనం పీరీల పండుగలో పాల్గొనే సంస్కృతిని వర్ణిస్తారు. చింత నిప్పుకణికల మీద అలాయి అంటూ నడవడం, పిల్లలు దక్కకపోతే పెంటమీదేసి పెంటయ్య అని పేరు పెట్టుకోవడం, దోతిబట్టతో చెట్టెనుకు అడ్డం పట్టి రొమ్ములు చక్కబెడుతుంటుంది. ఆమె పాలిట రాంరెడ్డి దేవుడిలా కనిపిస్తాడు. రాంరెడ్డి తండ్రి అయిన ఆ ఇంటి యాజమాని కూడా నాగి ప్రవర్తను మెచ్చుకుంటాడు.

ఒకరోజు ఆ ఇంటి వెనుక సందులో బండిని నిలిపి ఆ ఇంటి మనిషిలా భావించబడే కరణం పంతులు దొంగతనంగా ధాన్యం తరలించుకుపోయే ప్రయత్నాన్ని నాగి కనిపెట్టి భగ్నం చేస్తుంది. అందరి ముందూ దొంగగా పేరుబడ్డ నాగి నిజాయితీ, ఇంటి మనుషల్లా ఉండి నీతులు వల్లించే వారి మోసం బయటబడుతుంది.

రాంరెడ్డి 'గింజలు ఉంటే ఉన్నయి పోతే పోయినయ్ గాని తన కష్టం దక్కిందని' నాగి గురించి సంబరపడతాడు. రాలిపోయిన మణిపూసను మళ్ళీ దారానికి గుచ్చి దండకు కలిపిన్నని పొంగిపోతాడు.

దుర్భరమైన దారిద్ర్యంలో ఆకలి బాధను తట్టుకోలేని ఒక పేద పిల్లను సంస్కరించే ప్రయోగం చేసిన అభ్యుదయవాది ఆదర్శ యువకుడూ రాంరెడ్డి. ఆకలి అన్ని నేరాలనూ చేయిస్తుంది. ఒక సంస్కరణ మార్గం ఒక జీవితాన్ని మార్చేస్తుంది. ఇదీ ఎచ్చమ్మ చెప్పిన ఒక పల్లె 'నాగి' కథ.

ఈ కోవలోనివే **"ఊరవతలి బావి", "సంది"** కథలు : తనింటి బావి నీళ్ళను ఊరి వాళ్ళ అవసరాలకోసం ఏర్పాటు చేసిన అగ్రకుల యువకుడు రాధకృష్ణశాస్త్రి ఇంట్లో తల్లిది కరోర మడీ ఆచారాలూ, అంటూ ముట్టూ తేడాలు పాటించే స్వభావం అయినా ఆయన తన బావిని పూడిక తీయించి, చుట్టూ మూడు గిరికలు వేయించి పశువులు నీళ్ళు తాగేందుకు గచ్చు గోలెం కట్టిస్తాడు. తన కులాచారాన్ని మనవతా దృక్పథంతో పక్కకు నెట్టి సంస్కరణా ధ్యేయాన్ని ఆదర్శవంతంగా పాటిస్తాడు "ఊరవతలి బావి" కథలో. ఆచారాలు సనాతనమైనా వాటిని ఉల్లంఘించడం, సొంత వనరును సార్వజనీనం చేయడం ఒక సాహసం. అది సంస్కరణ లక్ష్యంతో మాత్రమే సాధ్యయ్యే ఆదర్శం. ఆ ముచ్చట్లన్నీ ఈ కథలో వినిపించారు రచయిత్రి.

"సంది" కథ సినిమా కథలా ఉండే ఆదర్శ భావాలు ప్రకటించే కథ.. ఒక ఊరిలో గొప్పింట్లో పని చేసే రాములు బిడ్డ 'సంది' తల్లిలేని పసిపిల్ల. ఆ ఇంటి యజమానులరాలు జగదీశ్వరి ఆ పిల్లను అక్కున చేర్చుకుంటుంది. సంది చదువునూ సంస్కారాన్నీ నేర్చుకుంటూ పెరుగుతుంది. ఆ ఇంటివాళ్ళందరిపై ఆజయాయిషీ చేస్తుంది.

యుక్తవయసులోకొస్తున్న సందిపై ఆ ఇంటి యాజమానీ, సందిని తండ్రిలా చూసుకున్న మనిషి కన్నుపడుతుంది. దానికి తోడు అతని బావమరిది కూడా సందిని లోబర్చుకునే ఎత్తుగడలు వేస్తుంటాడు. ఒక రోజు ఒక గదిలో సందిని పట్టుకొని దొంగతనం నెపంపెట్టి జగదీశ్వరి తమ్ముడూ, భర్త చేరి ఆమెను తిడ్తూ కొడ్తూ బట్టలు ఊడదీసి భీభత్సం చేస్తుంటారు. సంది తండ్రి రాములు కుళ్ళి కుళ్ళి ఏడుస్తుంటాడు. ఆ సమయంలో పట్నంలో చదువుకుంటున్న ఆ ఇంటి వారసుడూ యువకుడైన జగదీశ్వరి కొడుకు అక్కడికి వస్తాడు. ఆ దృశ్యం చూసి చలించి విషయం గ్రహిస్తాడు. తల్లిదండ్రులతో వాదించి వాళ్ళు సంది పట్ల చేసిన దానికి ప్రాయశ్చిత్తంగా ఆమెను పెళ్ళి చేసుకుంటానని.. కాబోయే మామ రాములను పిలుచుకొని సంది ఒంటికి బట్టల్ని చుట్టి ఆమె చేయి పట్టుకొని జీపులో ఎక్కించుకొని వెళ్ళిపోతాడు. ఆమెను పెళ్ళిచేసుకోవడానికి ధనికులూ భూస్వాములు, గొప్పవాళ్ళ ఇండ్లలో పనిచేసే ఆడవాళ్ళకు సామాన్యంగా ఎదురయ్యే అవమానాలు, పడే నిందలూ, లైంగిక వేధింపులనూ, అత్యాచారాలనూ గుర్తుకుతెస్తుంది సంది కథ. అయితే అన్ని కథలూ సుఖాంతం కావు అనేది నిజం. అరుదుగా సినిమాలో జరిగినట్లుగా ఎక్కడో బాధిత స్త్రీలకు న్యాయం జరుగుతుందని అనుకోవాలి. ఈ కథలో చదువుకున్న యువకుని సంస్కరణ దృక్పథం, ఆదర్శ స్వభావం చిత్రించారు రచయిత్రి.

స్త్రీల వెతలకు చెందిన కథలు :

సమాజం ఏదైనా, పల్లెనా, పట్నమైనా, పెద్ద నగరమైనా స్త్రీల వెతలకు అంతే లేదు. ప్రాంతమేదైనా స్త్రీల పట్ల వ్యవస్థ అత్యాచారాలకు అడ్డేలేదు. స్త్రీల వెతలకు సంబంధించిన చాలా కథల్ని రాసారు యశోదారెడ్డి. నిజానికి ఈ కథల్ని చదివితే ఆమె పీడిత జన పక్షపాత దృక్పథం అవగతమవుతుంది. స్త్రీలకు సంబంధించిన ఎన్నో సమస్యలు, కష్టాలు, విలువలు ప్రమాదకర పరిస్థితులకు సంబంధించిన విషయాలను కథలుగా మలిచారు రచయిత్రి. అందులో పల్లె స్త్రీల కన్నీటి గాథల్నీ సృజించారు.

ఆ కథల్లో **"కోడలమ్మ ఎతలు, దోరా! నన్ను అమ్ముకోకు, పరిత్యక్త, బరిబత్తలబొమ్మ, సంది, మోనా, నిప్పుతో చెలగాటం, కాలం చెప్పిన తీర్పు, కొత్త బాట"**ల్లో కొన్ని ఆదర్శ సంస్కరణా భావాలు అద్దుతూనే మహిళాలోకం కన్నీటి కడగండ్లను చిత్రించారు. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న వెతలను, రాజీపడుతున్న వెతల బతుకులను ప్రస్తావించారు.

యశోదారెడ్డి కథల్లో ఎన్నో పల్లె తెలంగాణా ముచ్చట్లను చదవవచ్చు. చదివి తెలుసుకోవచ్చు, పల్లెతనవు పామర ప్రజా జీవన పార్శ్వాలను వీక్షించవచ్చు. ఆ ముచ్చట్లన్నీ దోసిటపట్టి మననం చేసుకుంటూ మనమూ కథలు చెప్పవచ్చు, రాయవచ్చు.. ఎంతో నేర్చుకోవచ్చు. పల్లె భాషకు ప్రాణం పోసిన రచయిత్రికి శనార్తులు ! ఇది చదివిన మీ అందరికీ వందనాలు ! తెలంగాణా తల్లికి దండాలు !

(8 ఆగష్టు యశోదారెడ్డి 95వ జయంతి)

– అనిశెట్టి రజిత
9849482462

విశ్వవేదికపై "మోహన" రికార్డుల విశ్వరూపం



ఆమె మోహన మోహనంగా తన వర్ణాల సవరాగాలపించే, వాగ్గేయ కారిణి వారే రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి గారు. వీరు రాసే ప్రతి పదం తెలుగు భాష తేట తేనీయల అందం వినూత్న భావ విలసితం. వీరు రాసిన మోహన గజళ్ళు జి కె తెలుగు టాకీస్ లో కృష్ణ దువ్వూరి గారిచే దృశ్యీకరించబడి ప్రపంచ రికార్డులు అందుకొని విజయధంకా మ్రోగిం చాయి. రికార్డుల పంటగా నిలిచాయి. 4 ప్రపంచ రికార్డులు వారు వెలువరించిన మోహన గజళ్ళకు దక్కాయి. ఇందులో రెండు రచించి గానం చేసినందుకు మరో రెండు ఆమె రచన గానం దువ్వూరి కృష్ణ గారు చేసిన దృశ్యీకరణకు లభించాయి. మరో రెండు రికార్డులు ఆమె రచించిన మోహన, మల్లియలు, నిరాతప, వరాళి, సింజి అనే 5 గజళ్ళ సంపు టాలు సొంతం చేసుకున్నాయి. మొత్తం గా రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి గారిని 6 ప్రపంచ రికార్డులు వరించాయి. ఇటువంటి అపురూపమైన సత్కారం పొందడం మన తెలుగు సాహిత్యం లోనే కాదు తెలుగు గజల్ చరిత్రలోనే ప్రప్రథమం. మన మల్లీశ్వరి గారికిఈ రికార్డులు లభించడం మనకెంతో గర్వకారణం. ప్రతిష్టాత్మకమైన లినీతీశ్రీట రికార్డులు సాధించడం అనేది సామాన్యమైన విషయం కాదు. ఎంతో ప్రతిభతో తన భావాలను గజల్ ప్రక్రియలో ఇమిడ్చి వినూత్నమైన సొంపైన పదాలతో ఎల్లర హృదయాలను రంజింపజేస్తూ తానే స్వయంగా పాడడం మామూలు విషయం కాదు. అందరు రాసే గజల్స్‌కు భిన్నంగా ఎవరు సాటి పోటి లేని విధంగాఎవరు రాయనంత గొప్ప భావ సౌందర్యాన్ని, అర్థగాఢతను ప్రదర్శించే పద ప్రయోగాలతో , అద్భుత ప్రతీకరలతో సరికొత్త కాఫియాలతో లోకోత్తరంగా ఉంటుంది ఆమె గజల్ రచన అని అందరికి తెలిసిన విషయమే. ఆమె ఆహార్యంలో తెలుగుతనం, మాటల్లో తెలుగు భాష మాధుర్యం, కవితల్లో సున్నితము విశ్లేషణాత్మకమైన మానసిక భావనలు , సమాజహితం కనబడుతుంది. నిత్యంభాషా సాహిత్య రచనలో.. సేవలో, సాహితీ కార్యక్రమాలలో నిమగ్నమై ఉంటారు రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి గారు. వారుఎందరికో స్ఫూర్తి, ప్రేరణ, ఆదర్శం ఆమె .ఏ సాహితీ ప్రక్రియను చేపట్టినా, పరిశోధన గ్రంధాలు లిఖించినా తనదైన ఒక ప్రత్యేకతను చాటుకుంటారు.

మల్లీశ్వరి గారు గత మూడేళ్ళగా గజళ్ళు రాస్తున్నారు. వాటిని జి.కె.తెలుగు టాకీస్ అధినేత కృష్ణ దువ్వూరి గారు దృశ్యీకరణ చేసి మోహన గజళ్ళను ప్రపంచ వ్యాప్తం చేశారు. ఎందరినో అలరింవ చేసి , ఆహ్లాదింవ చేశారు. ఎందరిలోనో గజళ్ళపై మక్కువ కలిగించారు., భాషామతల్లికి ముద్దుబిడ్డ, అక్షర తవస్విని ఐన రాజావాసిరెడ్డిమల్లీశ్వరిగారు .వర్తమాన కవులకు మార్గదర్శకులయారు. భాషా పద ప్రయోగ ప్రేమికురాలు, బాలసాహితీవేత్త, వక్త, సమీక్షకురాలు బహుముఖ ప్రజ్ఞాశాలి, ఇంతవరకు ఇన్ని మనోజ్ఞమైన గజల్ పుస్తకాలు రాసి ప్రచురించడం వీరికి మాత్రమే సాధ్యమైన విషయం. అందుకనే వీరిని వరించాయిప్రపంచ రికార్డులు. ఈ మధ్య తను ప్రత్యేకంగా సాహిత్య సభల్లో గజల్స్ పాడించడం , విన్నూత్నంగా భావాల వివరణతో , అందమైన పదాల పరిమళాలను వెదజల్లేలా చేస్తున్న సాహితీ సమావేశాలు ఎందరినో ఆకట్టుకునేలా నూతనత్వానికి శ్రీకారం చుట్టారు. గూగుల్ మీట్‌లో కూడా గజల్‌కి కొత్త ఒరవడి సృష్టించారు. వారి గురించి ప్రఖ్యాత కవులు కృష్ణ బిక్కి గారు ఏమంటున్నారో చదవండి...." కష్టేఫలి. కృషిఫలించింది. అవార్డుల పంట పండింది. మీకు. గజల్ క్వీన్ వాసిరెడ్డి మల్లీశ్వరి గారికి శుభాకాంక్షలు. తెలుగు గజల్ కీర్తిని తొలిసారి అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్ళిన మీ కృషి అభినందనీయం. బహుదా శ్లాఘనీయం" .రాజా వాసిరెడ్డిమల్లీశ్వరిగారు తన సుందర భావుకతా రూపమైన వారి గజల్ గురించి ఎంత అందంగా తెలిపారో చదవండి...." ప్రతి పదంలో సిరిచందనపు పరిమళమే నా గజల్ప్రతి పదంలొ మొగలి పూలిచ్చు పరవశమే నా గజల్‌హరిచందన నందనాలసౌందర్య సంద్రమై ఎగసే మధురాక్షర భావ విహార పసదనమే నా గజల్‌సున్నిత స్వప్న రాగ తపనలో సోలింప చేస్తూ మనసుకు ఆహ్లాద లేపనపు పనితనమే నా గజల్ సరస సాహిత్య స్పందనా సరిగమలలో స్థానమైఉద్వేగోల్లాస ఊర్పుల విలసనమే నా గజల్‌మల్లీ కందువ అందెలు చేసే వికాస విందులలోవెన్నెలలో విరహపు కలువల విరిసరమే నా గజల్. "". ఎంతో గొప్పగా నేను "గజల్ రచన గానం చేసినా మోహన గజళ్ళ ను జీకె తెలుగు టాకిస్ అధినేత కృష్ణ దువ్వూరి గారు చిత్రీకరణ చేసి ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయడం వల్లనే నాకు ఈనాడు ఇన్ని అవార్డులు వచ్చాయి" అని అనటమన్నది ఆమె సహజ సౌజన్య శీలతకు నిదర్శనం. బాల సాహిత్యాన్ని ఇటు భాషాపరమైన పరిశోధనలను విస్తృత స్థాయిలో చేపట్టి పుంఖాను పుంఖాలుగా వ్యాసాలు, సమీక్షలు వ్రాసి పత్రికల్లో ప్రచురించి ఎంతోమంది భాషాభిమానుల ఆదరాభి మానాలను చూరగొన్న వారు మన మల్లీశ్వరిగారు." మన చుట్టూదే వాలయం, గ్రంథాలయం, బంధనాలయం, మకరాలయం, మహాలయం, విద్యాలయం వంటి ఎన్నో ఆలయాలు ఉన్నప్పటికీ మన మనసుని "ప్రేమాలయం" గా మార్చుకోనంత కాలము ఎంత ధనాన్ని, విజ్ఞానాన్ని, సంపాదించినా వ్యర్థము" అని మల్లీశ్వరి గారు అనడంలో ఔచిత్యం ఎంతో ఉంది.! ప్రేమమయి రాగమయి ఐన ఆమె పలుకు.రచన ..పదం ..పాట నేడు ప్రపంచ వేదికపై రికార్డుల బావుటాలనెగరేసి తన అక్షరాల... భావాలతో పాటు తన ప్రత్యేకతను చాటుకుని గజల్ విజేతగా నిలచినందుకు ఆ అక్షరమూర్తితో పాటు గజల్ గౌరవాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్ళిన తెలుగు భాషాభిమాని ఐన, మోహన గజళ్ళ దృశ్యీకరణ గావించిన కృష్ణ దువ్వూరి గారిని అందరం అభినందిద్దాం.

–డా.రాధా కుసుమ
9989241319

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 'భావదర్పణం' ఆవిష్కరణఅనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు.'భావదర్పణం' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా...
-సంపాదకులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం ఏకాంశ కవిత్వం నిర్వహణ:
-డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839

మమేకమైనరోజు -మరువలేనిరోజు

కవుల కలయిక
కలుపుగోలుగా పరామర్శ
ఆత్మీయ ఆలింగనాలు.
కవి సమ్మేళనం...
కాదు కాదు కరోనా తరువాత
కరచాలనం
కాదుకాదు ఆత్మీయ కార్యక్రమం.
అందరూ అరమరికల్లేకుండా
అతుక్కొని అలుపెరుగక కూర్చున్నారు
అల్లర్లు లేవు
అపోహలు లేవు
గుసగుసలు లేవు
ఆరు గంటల కార్యక్రమం
అలసట లేదు
బడిపిల్లల్లాగా
బాధ్యతగా శ్రవణం
సాహిత్య భావజాలం
జలధారలా
ఏరులై పారింది.
మహాకవులూ పెద్దలూ
హాస్యానంద అనుభవాలూ
అనుభూతులతో
సాహిత్య పుష్పపరిమళాల
వ్యాపన వాహకులు.
అందర్లో ఆసక్తి
కవి కావాలని
కవిగా వెలగాలని.

- డా. భూంపల్లి కేశవరెడ్డి

సాహిత్య సత్సంగం

సాహిత్య సత్సంగంలో
తడిసి ముద్దైనవారం
'సీతమాట'
'భావదర్పణం'
భావపు పుటల ఆవిష్కరణ పండుగలో
ఆడుకున్నవారం
చిరుగాలి తోడై
జడి చినుకుల మోత
సన్నాయి పాటలై
రాయారావు
సభా సమర్పణ చిత్రమై
సీతమ్మ సత్యమూర్తి చిరునవ్వులు
పూల ధారలై
రామకృష్ణ చంద్ర మౌళి కార్యదీక్షతో
నడిపిన తీరు సిరి వెన్నెల వెలుగై
సంతోషు హరిల
వ్యాఖ్యాన భూషిత శోభితమై
మహా మహా విశిష్ట అతిథుల
పద్య గద్య శుభాశీస్సుల మాటలు
వేదికకు వేద పారాయణ మంత్రాలై
నిండుగ దండిగ
ప్రేమ ఆప్యాయత భోజన వడ్డింపు
బ్రేవ్.. బ్రేవ్ మని తేల్చ
సుఖాసీనుల కవుల హృదయాల
సమ్మిళిత కవిగానాలతో
పరవశాన ఉన్న మందిరంలో
సాహితి మాత
పచ్చని పట్టు చీర
నగల అలంకరణతో
ఘల్లుఘల్లు మని నాట్యమాడ
వెలిగించిన జ్యోతి ప్రకాశమై
పంకా గాల్పులకు
వేదిక సందడికి
చల్లని శీతల యంత్రానికి
కదలక మెదలక
నిశ్చలమై నిలువ
అచ్చ నిదర్శనమే
అందరూ మహానుభావులు
అందరికీ వందనం.

-జె.నరసింహారావు

నేటి నిజములోన నెనరుగాను..

భావదర్పణమున భవ్యమౌ కవనముల్
వెలుగుచూడునిపుడు వేడ్కమీర
కవులభావనలకు కమనీయ వేదిక
దర్పణమ్ము నిల్చె దర్పముగను!.
వారమంత వ్రాయు వాసిగా రచనమ్ము
నేటి నిజములోన నెనరుగాను
గారవమ్ము తోడ గణుతికెక్కినతీరు
మిత్రలాభమదియె మిగులశుభము !!.
అంశమేది యైన నందరు వ్రాయగన్
పోటిపడుచు నుండు పుణ్యకవులు
రాయరావు గారి రమ్యమౌ వ్యాసమ్ము
లలరగాను మిగుల లక్షణముగ!.

-ఎం.వి.ఉమాదేవి

అమృత మహోత్సవ వేళ

వెన్నెల్లోంచి అక్షరాలు పుటలపైకి
కవి సమయాలతో కలాల కదలిక
సామాజిక మార్పుకోసం
కవిత్వానికి పట్టాభిషేకం
అసమానతల రూపు మార్పు కోసం
శీర్షికలే మోదుగు పూలై పూసే.
అంతరంగాల అంతర్మథనం
చల్లకవ్వం వెన్నను చిలికినట్లు
సమస్యలపై అక్షర సమరం.
ఒక్కో పూవుతో
బతుకమ్మను పేర్చినట్లు
ఒక్కో పూవుతో మాలను అల్లినట్లు
పదాలకు నడకలు నేర్పిన కూర్పులు.
తొణికిన స్వప్నాల సందర్శనం
నూతన కలాల కరచాలనం
ఆజాదీకా అమృత మహోత్సవ వేళ
భావదర్పణ ఆవిష్కరణం.

-ఏడెల్లి రాములు

భావము దర్పణమ్మవగ..

శా. రాయారావు ప్రకాశు సూర్య కిరణంలా మెర్సగా దర్పమై!
దాయాదీ కవులన్ రగల్చె కవితా ధారల్ యశంబవ్వగా!
వ్రాయాలీ మన తృష్ణదీర పదముల్ ప్రాసల్ యతుల్ జేరగన్!
చేయాలీ హితులున్ సమాజ పరమై శ్రేయస్సునందించగా!.

ఉ. భావము దర్పణమ్మవగ బాధ్యత గల్గియు నిత్యసత్యముల్!
చేవగ వ్రాసినట్టిదగు శ్రీకర వాక్యము శోభితమ్మవన్!
త్రోవయు జూపెగా బుధులు దూరపు లక్ష్యము చేరగా నిటన్!
బ్రోవగ భారతిన్ మదిన భూషణ కాంతుల రాజసమ్మవన్!

-ధర్మపురి వెంకటేశ్వర్లు

కవుల భావాలకు దర్పణం

కవుల భావాలకు దర్పణం
భావ దర్శనం
మన దర్పణం సాహిత్యవేదిక
విభిన్న అంశాలకు ప్రతిబింబం
దర్పణం సాహిత్య వేదిక
నిస్వార్థ సేవకు ప్రతి రూపం
మన రాయారావు సూర్య
అనుదినం సూర్యోదయాన
సాహిత్య పరిమళాల పలకరింపులు
మన మదిలో
కవితా కమలాలు వికసింప చేసే
సూర్య చంద్రుడిగా
సాహిత్య లోకపు రాజుగా రారాజుగా
షట్కతాధిక అంశాలతో
నేడది రూపుదిద్దుకునే భావదర్పణం
కవి లోకానికి ఆదర్శం
ఉభయ పుస్తకావిష్కరణ ముహూర్తాన
నా అక్షర మల్లెల అభినందనమాల.

-ఇమ్మడి రాంబాబు

కవుల కాసారం

బయటేమో కుండపోత
లోపల రసఝరుల మోత
కవుల కువకువల ధ్వనులు
రస మధురిమలు రాగ రనీజితాలు
ఏరులై పారుతున్న
కవితా గానాలు
రసాలనునినీపుకుంటున్న
కవితా కాసారాలు
హంసల్లా ఈదుతున్న
కవుల సమూహాలు
ఒక్కరొక్కరుగా చేరుతున్న
కవి పండితులు
వేదికనలనీకరించిన విద్యావేత్తలు
సభను రంజినీపచేస్తున్న ప్రసనీగాలు
విహంగాల్లా
రెక్కలు విచ్చుకుంటున్న కొత్త పుస్తకాలు
హాలంతా విస్తరిస్తున్న
సాహిత్య పరిమళాలు
సీత మాటల చిద్విలాసాలు
భావదర్పణం కనుమిట్ల కాంతులు
ధర్పణంలో ప్రతిబింబిస్తున్న
కవుల కవితలు
రస మధురిమలు
చతుర సంభాషణలు
సమయపాలనలు
సభలో సాహిత్య పరిమళాలు
మధ్య మధ్య సన్మానాల సంబరాలు
కెమెరాల తళుక్కులు
ముఖాలలో చమక్కులు
ఒకదాని వెనీబడి ఒకటిగా ముగుస్తూ
మళ్ళీ మొదలయ్యే సభలు
సాయంకాలం వరకు సాగిన సంబరాలు
బయట మబ్బుల చాటున
సూరీడు కనపడడు
కానీతులతో విరజిమ్ముతూ
ఇద్దరు సూర్యులు లోపల కనిపిస్తారు
ఒకటి సూర్య ప్రకాశం
రెండు నేటి నిజ తేజం
కవులను తయారు చేస్తున్న కర్మాగారం
మేడ్చల్- మల్కాజిగిరి కవుల దర్పణం.

-కందుకూరి మనోహర్

ధవళపు జాబిల్లి

కవిహృదయపు బింబములను
రవితేజముతోడజూపు రాజసమొప్పన్
కవితలకు భావదర్పణ
మవనీతల సుప్రకాశమనుభూతులతో!!.
సొమ్ముల్ పంచనితృప్తినిచ్చుకవితల్ శోధించివ్రాయించు స్వీ
యమ్మున్ శ్రద్ధవిశేషకర్మలను రాయారావు సూర్యప్రకా
శమ్మైవెల్గుచు దర్పణమ్ముగనగా సౌజన్య సౌహార్దుడై
సమ్మానమ్మునరక్షజేయు కవులన్ సాహిత్యవేదిన్మదిన్.
కవితల సంకలనములను
నవయుగ సంపాదకత్వ నాయకమణియై
జవమును పెంచెను పొత్తము
ధవళపు జాబిల్లి వెలుగు తారల ధగధగమెరిసెన్.

-మాడుగుల నారాయణమూర్తి

కరదీపిక

దీర్ఘకాల మేధామథనం!
కొత్త వారికి అవకాశం!
సమిష్టి కృషి
కృషితో నాస్తి దుర్భిక్షం!
అద్దం లో భౌతిక ప్రతిబింబాలు!
భావదర్పణంలో ఊహల తూనీగలు!
ఎవరికి ఎవరూ ఏమీకారు!
దర్పణ సూత్రంలో
ఏర్చి కూర్చిన పూమాలలు!
అంశం పట్టాలపై
చుక్ చుక్ సాగే భావాల రైలు బండి!
క్రమశిక్షణ సమీక్షలతో మరమ్మతులు!
కలాల కోయిలలు
గళాలు సవరించు !
ఆదిలో అంశం!
సమీక్షతో ముగింపు!
హేమాహేమీల పరిచయం!
నిరంతర సాహితీ ప్రవాహం!
ఇంకిపోని కవితల ఊటలు!
వారం వారం నేటి నిజంలో
తళుకులీనే కవితా తారకలు!.
సృజనాత్మకత కు పట్టం!
సమయపాలనకు మారుపేరు!
రవీంద్ర భారతి
సాహితీ సుమగంధాలు
వజ్రోత్సవాలు జరుపుకోవాలి!
భావదర్పణం కావాలి కరదీపిక!.

-ఎ.రాజ్యశ్రీ

సాహిత్య దర్పణం

మనసులోని కవనం
కమనీయ కథనం
కవుల రచనల సాహిత్యం
కరదీపికల భావ దర్పణం.
సాహిత్యాల స్వరూపం
సృజనాత్మకతల సంయుక్తం
భావజాలాల భవితవ్యం
భావదర్పణం సంకేతం.
ఏకాంశాల కవిత్వాలు
భిన్నత్వాల శీర్షికలు
విభిన్న రకాల భావాలు
భావదర్పణం నిదర్శనాలు.
కథలు కథానికలు
వచన పద్య గేయ కవితలు
వివిధ ప్రక్రియల సాహిత్యాలు
భావదర్పణం రచనలు.
కవులను మేల్కొల్పి
దర్పణంలో ప్రతిబింబింపజేసే
దర్పణం అక్షర శిల్పి
అలుపెరుగని రాయారావు కృషి.
సూర్య ప్రకాశమై వెలుగొందు
దర్పణం లో ప్రతిబింబించు
సాహిత్యాలు దర్పణంలో చూపు
రారాజుగా రాయారావు రాజ్యమేలు.

-గుండవరం కొండల్ రావు

అనూహ్యం

భావదర్పణం వేదిక
దర్పంతో దిమ్మదిరిగిపోయింది
అసంఖ్యాకులైన
సాహితీ దురంధరులను చూసి
అదిరిపడ్డాను
అతి బరువైన భావాలు
బరువైన భాషణలు
శక్తిమంతమైన ప్రసంగాలు
అతి శ్రద్ధగా శ్రవణం
వేడెక్కిన బుర్ర
ఊపిరి బిగపట్టి వింటున్న శ్రోతలు
మెదడుకెక్కుతున్న కవితావిధానాలు
ఒక్కొక్క వక్తా ఒక్కో తీరు
స్వానుభవాల జోడింపు
అర్థమైన వక్తల విలక్షణత
అత్యున్నత శిఖరాల అవగతం
శ్రద్ధగా ఆలకించడం నా పని
నిర్ణయమైన నా లక్ష్యం
సూర్యప్రకాశ్ రావూ బైసా దేవదాసూ
ఇంకా అతిరథ మహారథుల
ప్రసంగాలతో ఉత్తేజం
కొత్త కవిత జననం.

-ప్రొఫెసర్ సువర్ణ అలివేలు

భావదర్పణం బహుసుందరం

ఈ దర్పణం బహుకుశాగ్రం
కవుల భావదర్పణం వికసితం
భావాల వెల్లువ
జాలువారె కవితల్లో
కవితల వెలుగులో కవుల ప్రకాశం
ఈ పర్వదినం
అందరికీ ఆనందహేల
అతిథులందరికీ ఆత్మీయ సత్కారం
సోదరీసోదరుల కలయిక అపూర్వం
భవిష్యత్తులో మరెన్నో
సందర్భాలకు వేదిక
ఈ దర్పణం బహుసుందరం
ముంజేతి కంకణానికి అద్దమేల
ఈ దర్పణం దర్పం బహుమధురం.

-లక్ష్మారెడ్డి పసుల

కవుల్లారా నిర్బంధాలకు భయపడకండి

అక్షరాయుధాలను సంధించి సమాజాన్ని మేల్కొల్పండి. జనకవనంలో నేటినిజం పత్రికా సంపాదకులు బైసా దేవదాసు

హక్కులను కాపాడటం, సమాజాన్ని మేల్కొల్పటం కోసం కవులంతా అక్షరాయుధాలను సంధించాలని నేటినిజం సంపాదకులు బైసా దేవదాసు పిలుపునిచ్చారు. పాలకుల నిర్బంధాలకు భయపడకుండా ముందుకుసాగాలనీ, మనల్ని కాపాడేది అక్షరమేనని. నొక్కి చెప్పారు. మంగళవారం హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 75 ఏండ్ల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా తెలంగాణ సాహితి, టీపీఎస్కే, ప్రజా నాట్యమండలి, సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జనకవనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి, ముఖ్యఅతి థిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. సమాజ మార్పు కోరుకునేవారు మనలో ఉన్న మలినాన్ని తొలగించి ముందు ఇంటి నుంచే శుద్ధిని ప్రారంభించాలని సూచించారు. కనీస స్వేచ్ఛను భావితరాలకు అందించాల్సిన బాధ్యత కవులపై ఉందని నొక్కిచెప్పారు. సాహిత్య అధ్యయనం పెరిగేలా, దాని విలువల్ని కాపాడేలా ముందుకు సాగాలనీ, అక్షరసైనికులుగా ముందు భాగాన కవులు నిలబడాలని.. ఆకాంక్షించారు. తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఆనందా చారి మాట్లాడుతూ.. జనకవనం ప్రజల గుండెచప్పుడు కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చేనాటికి ఉన్న జనాభా 30 కోట్లు కాగా.. నేడు అంతే జనాభా నిరక్షరాస్యత, పోష్టికాహార లేమితో బాధపడుతున్న విషయాన్ని ఎత్తిచూపా రు. ఓవైపు దేశంలో ప్రజలు బాధపడు తుంటే చూడలేక ప్రశ్నించే, నిలదీసే, అడిగే 2 లక్షల మంది మేధావులు, జర్నలిస్టులు, సామాజికవేత్తలు, కవులను జైళ్లలో మగ్గేలా నేటి పాలకులు వ్యవహరిస్తున్న తీరును వివరించారు. ఎస్వీకే కార్యదర్శి ఎస్. వినయకుమార్ మాట్లాడుతూ.. సమాజంలో నేడు జరుగుతున్న పాలకులు అనుసరిస్తున్న పరిణామాలను, ఎత్తిచూపుతూ ప్రజల్ని చైతన్యం చేయాల్సిన బాధ్యత కవులపై ఉందన్నారు. తెలంగాణ సాహితీ నాయకులు ఏబూషి నర్సింహ అధ్యక్షతన జరిగిన సభలో అనుముల ప్రభాకరాచారి, ఎం. రేఖ జనకవనాన్ని నిర్వహించారు. పలువురు కవులు పాలకుల విధానాలపై తమ కవితా స్త్రాలను సంధించారు. తెలంగాణ సాహితీ ఉపాధ్యక్షులు తంగిరాల చక్రవర్తి, నస్రీన్, అనం తోజు మోహనకృష్ణ, సహాయకార్యదర్శి ఎస్ కే సలీమా,తదితరులు పాల్గన్నారు.

మంచి కథలు రావడం వల్ల మంచి సమాజం ఏర్పడుతుందని, ఇటువంటి కథల పోటీలు నిర్వహించడం ద్వారా మంచి కథలు వెలువడతాయని" రమ్య భారతి సాహిత్య త్రైమాస పత్రిక గౌరవ సంపాదకులు సోమేపల్లి వెంకట సుబ్బయ్య అన్నారు. ఆదివారం ఉదయం స్థానిక ఠాగూర్ గ్రంథాలయంలో రమ్య భారతి పత్రిక ఆధ్వర్యంలో జరిగిన కోపూరి శ్రీనివాస్ స్మారక విశిష్ట పురస్కారాలు జాతియ స్థాయి సింగల్ పేజీ కథల పోటీ విజేతల బహుమతి ప్రధానోత్సవ సభకు అధ్యక్షత వహించి ప్రసంగించారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి శాంతి శ్రీ ఆత్మీయ అతిథిగా పాల్గొన్నారు. అనంతరం వివిధ రంగాలలో ప్రముఖులు శ్రీ గుమ్మా సాంబశివరావు, కావూరి సత్యవతి, పులిపాటి దుర్గారావు లకు ఒక్కొక్కరికి 5000 నగదుతో పాటు, శాలువా, దండ, జ్ఞాపికలతో కోపూరి శ్రీనివాస్ స్మారక విశిష్ట పురస్కారాలను అతిథులు ప్రధానం చేశారు. అలాగే జాతీయస్థాయిలో నిర్వహించిన సింగల్ పేజీ కదల పోటీ విజేతలైన ఖమ్మం జిల్లాకు చెందిన వేణు మరీదుకు ప్రథమ, అనకాపల్లి కి చెందిన జి రంగబాబు కు ద్వితీయ, విజయవాడకు చెందిన బివీ శివప్రసాద్ కు కన్సోలేషన్ బహుమతుల కింద నగదు సాలువ దండ ప్రశంసా పత్రాలతో సన్మానించారు. కార్యక్రమాన్ని రమ్య భారతి సంపాదకులు చలపాక ప్రకాష్, పోపూరి పుష్పా దేవి నిర్వహించారు.

ఆదివారం గుంటూరులో చలపాక ప్రకాష్ రచన 'నా జీవనయాత్ర ' దీర్ఘ కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి. చిత్రంలో అభ్యుదయ రచయితల సంఘం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ, ఆంధ్ర ప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షులు సోమేపల్లి వెంకటసుబ్బయ్య, వశిష్ట , ఎస్ఎం సుభాని ఉన్నారు.

ఆగష్టు 4న హైదరాబాద్ రవీంద్రభారతి సమావేశ మందిరంలో సాహితీకిరణం నిర్వహించిన ఒక కార్యక్రమంలో స్వర్గీయ దిట్టకవి రామయోగి దీక్షితులు రచించిన 'రుక్మిణీపతి శతకం' పుస్తకాన్ని డా॥బొల్లినేని భాస్కరరావు ఆవిష్కరించగా డా॥కె.వి.రమణాచారి ముఖ్యఅతిథిగా విచ్చేసారు. చిత్రంలో పెద్దూరి వెంకటదాసు, పొత్తూరి సుబ్బారావు, డా॥వై.రామకృష్ణారావు, డి.వి.ఎస్.గోపాలబాబు(పరిష్కర్త),

ఆచార్య వెలదండ నిత్యానందరావు(సభాధ్యక్షులు), గుదిబండి వెంకటరెడ్డి, పింగళి వేంకటకృష్ణారావు, రాపోలు సుదర్శన్, డా॥మలుగ అంజయ్య. అదే సభలో పరిష్కర్త దంపతులను సత్కరిస్తున్న దృశ్యం.

అలరించిన "నెచ్చెలి" సాహితీ సమావేశాలు

అంతర్జాల వనితా మాసపత్రిక "నెచ్చెలి" ఆధ్వర్యంలో ఆగస్టు 7 2022 ఆదివారం ఉదయం నించి సాయంత్రం వరకు హైదరాబాదులోని బాగ్ లింగంపల్లి సుందరయ్య కళా కేంద్రంలో ఉ.10.30 గం. నుండి రాత్రి 8.30 వరకు జరిగిన సాహితీ సమావేశాలు సామాజిక స్పృహ కలిగి నందేశాత్మకంగా జరిగాయి. ముందుగా నెచ్చెలి ప్రచురణల తొలి సంకలనమైన 'గత ముప్పై ఏళ్ల స్త్రీవాద కవిత్వ సంకలనం (1993-2022) - అపరాజిత' పుస్తకాన్ని ప్రముఖ రచయిత్రి, సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత ఓల్గాగారు ఆవిష్కరించారు. ప్రముఖ రచయిత్రి డా. కొండపల్లి నీహారిణి గారు అధ్యక్షత వహించిన ఈ సభలో ఆత్మీయ అతిథులుగా ప్రముఖ కవయిత్రులు శిలాలోలిత గారు, జూపాక సుభద్ర గారు పాల్గొన్నారు. "ఈ సంకలనం 1993లో వచ్చిన "నీలిమేఘాల" తర్వాత 2022లో వస్తున్న ఈ "అపరాజిత" ముప్పై సంవత్సరాల తర్వాత వస్తున్న స్త్రీవాద కవయిత్రుల సంకలనంగా చరిత్ర సృష్టించడమే కాకుండా, పూర్తిగా ఆధునిక స్త్రీ మనోభావజాలాన్ని, చైతన్యాన్ని సుస్పష్టం చేస్తూ ఇప్పటి స్త్రీవాదబలాన్ని తెలియజేస్తుంది" అని నెచ్చెలి పత్రికా వ్యవస్థాపకురాలు, 'అపరాజిత' ప్రచురణకర్త, సంపాదకురాలు డాక్టర్ కె.గీత తెలియజేసారు.

మధ్యాహ్నం 1.30 గం. నుండి జరిగిన నెచ్చెలి రచయిత(త్ర)ల మీట్ & గ్రీట్ కార్యక్రమంలో నెచ్చెలి రచయిత(త)లు కె. వరలక్ష్మి, ఆలూరి విజయలక్ష్మి, తమిరిశ జానకి, వసుంధారాణి, సి.బి.రావు మున్నగువారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని నెచ్చెలి ఉప సంపాదకులు రత్నాకర్ నిర్వహించారు.

మధ్యాహ్నం 3.30 గం.కి వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ఆధ్వర్యంలో డా.కె.గీత రాసిన నవల "వెనుతిరగని వెన్నెల" ఆవిష్కరణ & సమీక్షా కార్యక్రమం జరిగింది. సభని శిరోమణి డా.వంశీ రామరాజు, మేనేజింగ్ ట్రస్టీ, వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా (ఇండియా చాప్టర్) ప్రారంభించగా, ముఖ్య అతిథి తెలంగాణా సాహిత్య అకాడెమీ అధ్యక్షులు డా.నందిని సిద్ధారెడ్డి గారు ఆవిష్కరణ చేసారు. ప్రముఖ విమర్శకులు శ్రీ ఎన్.వేణుగోపాల్ గారు అధ్యక్షత వహించగా, డా.నాళేశ్వరం శంకరం గారు, డా.సి.హెచ్. సుశీల గారు వక్తలుగా ప్రసంగించారు. ఈ నవల ప్రతి చిన్న కష్టానికి కుంగిపోయే ఈ కాలపు యువతులు తప్పక చదివి తీరాల్సినదని వక్తలు అభిప్రాయపడ్డారు.

సాయంత్రం 6 గం.కి జరిగిన సభా కార్యక్రమంలో ప్రముఖ సినీ నటులు శ్రీ తనికెళ్ల భరణి డాక్టర్ కె.గీతామాధవి (కె.గీత) గారికి "డా.తెన్నేటి లత - వంశీ" జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేసారు. వంశీ ఆర్ట్స్ అధ్యక్షురాలు డా తెన్నేటి సుధాదేవి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆ రోజు చివరగా జరిగిన కార్యక్రమంలో డా.కె.గీత గారి అయిదవ కవితాసంపుటి "అసింట" (కవిత్వం & పాటలు) పుస్తకాన్ని శ్రీ తనికెళ్ళ భరణి గారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రజ్యోతి ఎడిటర్ శ్రీ కె.శ్రీనివాస్ గారు ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఆత్మీయ అతిథులుగా ప్రముఖ కవులు శ్రీ కందుకూరి శ్రీరాములు గారు, శ్రీమతి శీలా సుభద్రాదేవి గారు ప్రసంగించారు. గీతగారు కోవిడ్ కాలంలో అమెరికా నుండి రాసిన కవిత్వం "అసింట". ఇందులో గీతగారు స్వయంగా రాసి, పాడిన లలితగీతాలు కూడా ఉండడం విశేషం. ఇవన్నీ ఇప్పటికే యూట్యూబ్ ఛానెళ్లలో విడుదల అయ్యి అత్యంత ప్రజాదరణ పొందినవి.

ఈ రోజు విడుదలైన పుస్తకాలు స్థానికంగాను, అంతర్జాలంలోనూ అన్ని పుస్తక విక్రయ కేంద్రాల్లోనూ దొరుకుతాయని లేదా నెచ్చెలి ఎడిటర్ ని ఈ మెయిలు ద్వారా సంప్రదించవచ్చని నెచ్చెలి ఎడిటర్ డా.కె.గీత తెలియజేసారు.

కిన్నెర ఆధ్వర్యంలో శేషాద్రికి పురస్కారం ప్రదానం

శేషాద్రికి పురస్కారం ప్రదానం చేస్తున్న చిత్తరంజన్

కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ప్రముఖ సంగీత విద్వాంసులు కొమండూరి శేషాద్రికి సంగీత విద్వాంసులు చౌటి భాస్కర్ పురస్కారం బహూకరించారు. ఈ కార్యక్రమం కళావేదికలో జరిగింది. పురస్కారాన్ని ప్రదానం చేసిన సంగీత విద్వాంసులు మహాభాష్యం చిత్తరంజన్ మాట్లాడుతూ భాస్కర్ సుప్రసిద్ధ సంగీత విద్వాంసుడని పేర్కొన్నారు. 60 దశకంలో ఆయన అనేక కీర్తనలు మధురంగా ఆలపించారన్నారు. ఆయన అనేక కీర్తనలు రచించిన వాగ్గేయ కారుడన్నారు. దాశరథి పురస్కార గ్రహిత వఝుల శివకుమార్,కిన్నెర రఘురామ్, సభకుముందు సంగీత కచేరి నిర్వహించిన చౌటి ఆనంద్ రఘునందన్ సభలో పాల్గొన్నారు.

రంగా రంగా వైభవంగా జాతీయ జెండా పండగల పంపిణీ - శ్రీ దాసరి రమేష్

ములుగు , ఆగష్టు 10: (నేటినిజం ప్రతినిధి): స్వతంత్ర వజ్రవారోత్సవా లో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పిలుపుమేరకు గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారికి ఆదేశానుసారం జిల్లాలోని అన్ని మండలాల్లో మరియు గ్రామాలలో జాతీయ జెండాను పంపిణీ చేసే కార్యక్రమంలో భాగంగా ఈరోజు ఉదయం ములుగు మండలం జాగారం గ్రామపంచాయతీ లో సర్పంచ్ అధ్యక్షతన సీనియర్ నాయకులు శ్రీ గోవింద నాయక్ మాట్లాడుతూ ఆనాడు భారతదేశం స్వాతంత్రం రావడం లో ఎందరో మహానుభావుల త్యాగ ఫలితాలు అనేక పోరాటాలు అహింస మార్గంలో పయనించి అన్ని వర్గాల ప్రజలను చైతన్య పరుస్తూ అవగాహన కల్పిస్తూ బ్రిటిష్ నిరంకుశ పాలన నుండి భారత దేశానికి స్వతంత్రం తీసుకురా వడం కోసం ఆనాడు జరిగిన కొన్ని ముఖ్యమైన ఘట్టాలను దేశ ప్రజలకు వివరిస్తూ తెలియజేస్తూ స్వాతంత్రం యొక్క అవశ్యకతను తెలియజేస్తూ గ్రామ గ్రామాన తిరుగుతూ జాతీయ జెండాను అందిస్తూ ప్రజల్లో స్వాతంత్ర వేడుకల్లో పాల్గొనాలని ప్రజలకు అధికారులకు మేధావులకు విద్యార్థులకు పిలుపునిచ్చారు.

కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

అడ్మిన్: రమాదేవి కులకర్ణి

'బుధవారం బాధ్సా'

పోటీ ఫలితాలు

(ప్రథమ)

కుసుమ వనాలు

నిర్వహణ: శ్రీమతి సత్య నీలిమ వలిపే
ఈ సమూహంలో చేరదలచినవారు 8985613123కి మెసేజ్ చేయవచ్చు.

ఎన్ని బంగరుకిరణాలు
నీవాకిటిలో పరుచుకొని
వేచిచూస్తున్నాయో
రెప్పల తలపులు తెరవమంటూ
పక్షుల కిలకిలరావాలతో
సందేశమును పంపుతున్నాయి...
నిన్నటి నీరెండల నీడలు నిన్ను
దుప్పటిలా చుట్టి నిశీధి రాజ్యంలో
ఏకాకినిచేసెనని...
కన్నీటి జలపాతాలలో
మునకలేస్తూ
ఆర్తితో ఎండినగొంతుకు
దాహాన్ని తీర్చ చీకటినే
తాగుతావెందుకు...
బతుకులవెతలను మదిగూటిలో
మూలకు చుట్టి
నవనవోన్వేష భావసుమాలతో
హేమంతరాగాలాలపించుతూ
కొమ్మ కొమ్మనూ పలకరించు....
ఎమ్మరెమ్మలోని పూలనవ్వులను
అరువుగా తీసుకొని
ఆశయపుప్పొదులు
జల్లుతూ అనుభవాల దారులలో
నెనరుఅడుగులేయి.....
అప్పుడన్నీ
వసంతాగమనములే
నవకోయిల తీపిరాగాలు
ఎర్రెర్రని చిగుర్ల కొంగొత్త
కుసుమవనాలె
నీ అలుపెరుగని దారిలో
పరుచుకొని స్వాగతమిస్తూ
నవవసంతాలాపనలతో
పల్లవించవా నీగొంతులో

-వకుళ వాసు

ప్రయత్నం సాగించాలి చివరి వరకు

నీకంటూ ఉన్న ఆశయం
నీవు కట్టుకున్న ఆశలసౌధం
నీ భవిష్యత్తు నీ జీవితం
నీవు చేరుకోవాలన్న ఆనంద తీరం
ఉన్నతంగా సాగాలన్న స్వప్నం
రాదుగా అంత
అవలీలగా ఆ విజయం.
నీవెంచుకున్న లక్ష్యసాధనలో
ఎదురయ్యే కఠినమైన పరిస్థితులలో
దృఢమైన సంకల్ప బలంతో
నీపై ఉంచాలి ఎనలేని విశ్వాసనీ.
ఆత్మ విశ్వాసం బలంగా ఉంటే
శారీరకంగా అలసిపోయిన గాని
మానసికంగా ఉ